16 ఏళ్ల నిరీక్షణకు తెర..!

పాల్వంచ, న్యూస్‌టుడే



కష్టపడి చదివి 2008 డీఎస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. ఉపాధ్యాయ వృత్తిలో చేరి విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని సంకల్పించారు. అయితే అనూహ్యంగా కొన్ని అవాంతరాలు ఎదురవటంతో ఉద్యోగంలో చేరలేకపోయారు. బతుకుదెరువు కోసం కొందరు దినసరి కూలీలు అవతారమెత్తారు. మరికొందరు ప్రైవేట్ కొలువులు చేసుకుంటున్నారు. ఇంకొందరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. 2008లో నష్టపోయిన డీఎస్సీ అభ్యర్థుల నిరీక్షణ ఎట్టకేలకు ఫలించింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఏజెన్సీ ప్రాంతంలో 202 మంది, నాన్ ఏజెన్సీ ప్రాంతంలో 128 మందికి ప్రయోజనం కలగనుంది. ఇన్నాళ్లకు తమ శ్రమ ఫలించిందని ఆనందపడుతున్నారు. డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు కాంట్రాక్టు పద్ధతిన కాకుండా రెగ్యులర్ ఉద్యోగులుగా ఉంటే బాగుండుననే అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ)గా మరికొన్ని రోజుల్లో కొలువు దీరనున్నారు. ఈ సందర్భంగా పలువురు తమ అభిప్రాయాలను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.

అప్పట్లోనే ఉపాధ్యాయ కొలువు చేపడతాననుకున్నా

పొలిశెట్టి సాయిరామకృష్ణ, 2008 డీఎస్సీ అభ్యర్థి



మాది భద్రాచలం ఎంపీ కాలనీ. ప్రస్తుతం నాకు 40 ఏళ్లు. 2008లోనే డీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాను. అప్పట్లోనే ఉపాధ్యాయ కొలువులో చేరతానని అనుకున్నా. అయినా ఉద్యోగం రాలేదు. నిరాశ చెందకుండా ఇతర కొలువులపై దృష్టిసారించా. టీజీటీ (ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్) ఉద్యోగం వచ్చింది. 2024 ఆగస్టు 1 నుంచి పాల్వంచ సాంఘిక సంక్షేమ గురుకులంలో గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాను. 2008 డీఎస్సీ అభ్యర్థుల విషయంలో సర్కారు తాజా నిర్ణయంతో నాతోటి స్నేహితుల ఆశలు చిగురించాయి.

రెవెన్యూ శాఖలోకి..

గొల్ల వాసు, 2008 డీఎస్సీ అభ్యర్థి



ఎన్నో కలలు కన్నా. కానీ కొలువు మాత్రం దక్కలేదని మదనపడ్డా. చివరికి ఊరట లభించింది. మాది ఖమ్మం జిల్లా మధిర. నాకు ఇప్పుడు 44 ఏళ్లు. 2012లో వీఆర్ఏగా ఉద్యోగం సాధించా. ప్రస్తుతం మధిర తహసీల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నా.

ప్రస్తుతం సీఆర్పీగా పనిచేస్తున్నా..

బాడిసె సంపత్, 2008 డీఎస్సీ అభ్యర్థి



2008 డీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించటంతో ఎంతో ఆనందపడ్డా. అనివార్య కారణాలతో ఉద్యోగం దక్కలేదు. నష్టపోయిన వ్యక్తికీ పూర్తిస్థాయిలో న్యాయం చేయాలి. మాది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం. అనిశెట్టిపల్లి గ్రామం. నాకు ఇప్పుడు 43 ఏళ్లు. 2012 నుంచి సమగ్ర శిక్ష విభాగంలో సీఆర్పీగా పనిచేస్తున్నా.

2008 డీఎస్సీలో నష్టపోయిన బీఈడీ అభ్యర్థుల తుది జాబితాపై కసరత్తు చేస్తున్నాం. ప్రస్తుతానికి 128 మంది నాన్ ఏజెన్సీ అభ్యర్థుల జాబితా రూపొందించాం. ఏజెన్సీ అభ్యర్థులపై కసరత్తు కొనసాగుతోంది. అభ్యర్థుల ధ్రువపత్రాలను సోమవారం నుంచి పరిశీలిస్తాం. - సోమశేఖరశర్మ, డీఈఓ, ఖమ్మం



ఖమ్మాన్ని పర్యాటక గుమ్మంగా తీర్చిదిద్దుతాం: తుమ్మల

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలను పర్యాటకంగా తీర్చిదిద్దుతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పర్యాటక అభివృద్ధి, ఖమ్మం ఖిల్లాపై రోప్‌వే పనులపై తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, ఎండీ ప్రకాశ్‌రెడ్డితో కలిసి సచివాలయంలో గురువారం సమీక్షించారు. ఖిల్లాపై రోప్‌వే పనులు వేగంతంగా పూర్తి చేయాలన్నారు. భద్రాద్రిలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేలా చర్యలు తీసుకోవాలని, కిన్నెరసాని ప్రాజెక్టు అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. నేలకొండపల్లి బౌద్ధస్తూపం, భక్త రామదాసు ధ్యాన మందిరం, కూసుమంచి శివాలయం అంశాలపై చర్చించారు.



అభివృద్ధి పనులపై చర్చిస్తున్న మంత్రి తుమ్మల

మేం.. డిజిటల్ సర్వే చేయలేం..!

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం న్యూస్‌టుడే, ఖమ్మం వ్యవసాయం

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'డిజిటల్ పంట సర్వే'కు ఆదిలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పంటల సర్వే బాధ్యతలను వ్యవసాయ విస్తరణాధికారులకు సర్కారు అప్పగించింది. ఈమేరకు శిక్షణ, యాప్‌లను ఏఈఓలకు అందించింది. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మంగళవారం సర్వే ప్రారంభించాల్సి ఉండగా... పని ఒత్తిడి, సిబ్బంది కొరత వంటి కారణాలతో సర్వే చేయలేమంటూ ఏఈఓలు చేతులెత్తేస్తున్నారు. వ్యవసాయ శాఖలోని 49 రకాల పనులు చేస్తున్నాం.. డిజిటల్ సర్వే నిర్వహించటం అసాధ్యమంటున్నారు. పంటల సాగు విస్తీర్ణాన్ని బట్టి తమకు సహాయక సిబ్బందిని నియమిస్తే సర్వే చేస్తామని చెబుతున్నారు.



	సాగు భూమి(ఎకరాల్లో)	ఏఈఓలు
ఖమ్మం	5,80,200	129
భద్రాద్రి	5,76,000	67

ఎందుకీ పంట సర్వే..?

భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ఆహారభద్రత, పంటల బీమాతోపాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే పంట నష్టాన్ని అంచనా వేయటం, ఆహార ధాన్యాల ఎగుమతి, పంటల కొనుగోలు, సాగు ప్రణాళిక, మార్కెటింగ్ తదితరాలకు డిజిటల్ పంట సర్వే ముఖ్యభూమిక పోషించనుంది. ఇందులో భాగంగా వ్యవసాయ రంగంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(డీపీఐ)ని రూపొందించే లక్ష్యంతో 'డిజిటల్ అగ్రి మిషన్' పథకాన్ని కేంద్రం తీసుకొచ్చింది. దీని అమలుకు రూ.2,817కోట్లు వెచ్చిస్తోంది. రైతులకు ప్రయోజనం చేకూర్చటానికి, వ్యవసాయ సామర్థ్యాన్ని పెంచటానికి ఆధునిక సాంకేతికతను వినియోగించనుంది. రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈకార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తుంది.

పక్క రాష్ట్రాల్లో ఇదీ పరిస్థితి

ఆంధ్రప్రదేశ్‌లో 1,000-1,500 ఎకరాల వరకు ఒక గ్రామ వ్యవసాయ సహాయకుడిని అక్కడి ప్రభుత్వం నియమించింది. గ్రామ స్థాయిలో వివిధ వ్యవసాయ సర్వేలు, ప్రభుత్వ పథకాల అమలులో భాగస్వామ్యం, రైతులను గుర్తించటం, ధ్రువపత్రాల సేకరణ, రైతు సమావేశాల నిర్వహణ వంటి విధులు నిర్వర్తించటంతో వ్యవసాయ విస్తరణ సేవలు అన్నదాతలకు మరింత చేరువయ్యాయి. మహారాష్ట్ర, ఒడిశాలో టెండర్ ప్రక్రియ ద్వారా ప్రైవేటు కంపెనీలకు డిజిటల్ పంట సర్వే బాధ్యతలు అప్పగించారు. కర్ణాటకలో ఒప్పంద ప్రాతిపదికన సిబ్బందిని నియమించి సర్వే చేయిస్తున్నారు. తమిళనాడులో వ్యవసాయ విద్యార్థులను వినియోగించి రోజువారీ వేతనంతో పనిచేయించుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వ సూచనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం గ్రామ వ్యవసాయ సహాయకులను నియమిస్తే సర్వే చేయటానికి సిద్ధమని ఏఈఓల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్‌గౌడ్, సురేశ్‌రెడ్డి చెబుతున్నారు.

సిబ్బంది కొరతే సమస్య

ఖమ్మం, భద్రాద్రి జిల్లాలో 196 మంది వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈఓలు) పనిచేస్తున్నారు. వీరి పరిధిలో సుమారు 11.56 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. ప్రతి 5వేల ఎకరాలకు ఒకరి చొప్పున 232 మంది ఏఈఓలు అవసరం. ఉభయ జిల్లాల్లో దాదాపు 50 శాతం క్లస్టర్లలో సాగు భూమి 5వేల ఎకరాలకు మించి ఉంది. ఇల్లెందు మండలం కొమరారం క్లస్టర్‌లో ఒక్క ఏఈఓ పరిధిలో సుమారు 29వేల ఎకరాల సాగు భూమి ఉండటం గమనార్హం. డిజిటల్ సర్వేలో భాగంగా సదరు ఏఈఓలు తమ పరిధిలోని అన్ని పంట పొలాల్లోని సర్వే నంబర్లలోకి వెళ్లి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది.

ముసాయిదా జాబితాపై 922 అభ్యంతరాలు పరిష్కారం

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం జిల్లాలోని 589 గ్రామ పంచాయతీలు, 5,398 వార్డుల్లో ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితాపై ప్రజల నుంచి 922 అభ్యంతరాలు అందాయి. వాటన్నింటినీ గురువారం నాటికి పరిష్కరించినట్లు జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత తెలిపారు. ఈనెల 28న వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితా వెల్లడిస్తామని చెప్పారు.

WANTED
A reputed institution in Khammam requires MATHEMATICS and CHEMISTRY faculty for IIT Foundation Programme.
Qly.: M.Sc., B.Ed., (Minimum 3 years Experience in Teaching
9949016074, 9248977757
పద్మజ యాడ్స్ - 8008288630

IN THE COURT OF THE IIIrd ADDL. DISTRICT COURT AT KHAMMAM
E.P. NO.73/2019
ARB NO.3472.2017

Between :
M/s Shriram City Union Finance Limited, Khammam II Branch, rep. by its GPA Holder K. Srinivasulu ....DHR
AND
Seelam Sailaja & 2 others ..... JDR's

1) SEELAM SAILAJA, S/o. Upender, age : 40 yrs, Occ : Sailaja Milk Dairy, R/o. H.No. 2-401, 2nd Block, Kaikondai gudem, Khammam.
2) SEELAM RAMAKRISHNA, S/o. Upender, age : 22 yrs, R/o. H.No. 2-401, Kaikondaigudem, Mallemadugu , Khammam.
3) BANOTH MURALI BABU, S/o. Banoth Balakrishna, age : 34 yrs, R/o. H.No. 17-59, Marrigudem (V), Buddharam, Khammam.

సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా...! శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, ఖమ్మం 2 బ్రాంచీ తనకు రావలసిన డబ్బులు రాబట్టుకొనుటకు ఏఆర్బి కేసు నెం. 3472/2017 ద్వారా శీలం శైలజ పై డిక్రీ పొంది యున్నారు. సదరు అవార్డు డిక్రీని అనుసరించి చెల్లించవలసిన రూపాయలు అసలు, వడ్డీ మరియు ఖర్చులు చెల్లించని కారణంగా ఇ.పి. నెం.73/2019 ద్వారా మొత్తం డబ్బులు రాబట్టుకొనుటకై శీలం శైలజ గారి స్వాధీనానుభవ యాజమాన్య హక్కు భుక్తముల లోని దిగువ షెడ్యూలు స్థిరాస్తిని కోర్టువారు అటాచ్మెంట్ చేసి యున్నారు. మరియు దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని అమ్మవలసినదిగా పై కోర్టు వారిని కోరినందున సదరు కోర్టు వారు అజ్ఞానుసారం ది. 26-10-2024 ఉ.గం. 10.30 ని॥లకు కోర్టు వారి షరతులకు లోబడి బహిరంగ వేల వేయడం జరుగుతుంది. కావున ఆసక్తి గలవారు పైన తెలిపిన కోర్టు వారు నిర్వహించబడు వేలంలో పాల్గొని దిగువ షెడ్యూలు స్థిరాస్తిని కొనుగోలు చేయవచ్చు. ఈ రోజు వరకు అవార్డు/ డిక్రీ బాపతు అసలు, వడ్డీ మరియు ఖర్చులు మొత్తం కలిపి శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ కు రావలసిన బకాయి రూ. ఇపి అమౌంట్ రూ.12,49,014

SCHEDULE OF THE IMMOVABLE PROPERTY TO BE ATTACHED
The open house plot bearing No.21 admeasuring to an extent of 200 sq yards or 167.22 sq mtrs, out of Sy. No. 273/A, situated at Mallemadugu Revenue Village Khammam Rural Mandal & District. Registrattion Distict Khammam
East : Vacant site of Others,
West : 30" ft Road,
North : Plot no. 20,
South : Vacant site of Others
G.HARENDAR REDDY, Advocate, Khammam

ఎన్నెస్పీ కాల్వపై అక్రమ కట్టడాల కూల్చివేత



వైరా, న్యూస్‌టుడే: వైరా మున్సిపాలిటీ లోని శాంతినగర్ ఎస్టీకాలనీ రైతు వేదిక సమీపంలో అనుమతులు లేకుండా ఎన్నెస్పీ కాల్వపై నిర్మించిన కట్టడాలను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. శాంతినగర్ ఎస్టీకాలనీ పక్కన ఎన్ఎస్‌సీ కాలువ స్థలాలను కొంతమంది ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఇటీవల ప్రభుత్వ అనుమతులు లేకుండా భవనాలు నిర్మించడంతో మున్సిపల్ కమిషనర్ వేణు, పట్టణ ప్రణాళిక అధికారి భాస్కర్.. పనులను గురువారం పరిశీలించి జేసీబీతో తొలగించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

ఇక్కడ సపరేటు..!

☆ వారసత్వంగా వచ్చిన ఇంటిపై ఖమ్మం గ్రామీణ మండలానికి చెందిన ఓ వ్యక్తి బ్యాంకు రుణం తీసుకోవాలనుకున్నారు. దానికి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ అవసరమని బ్యాంకు అధికారులు చెప్పారు. ఇంటి రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సదరు వ్యక్తి వెళ్లారు. ఇంటికి సంబంధించిన డాక్యుమెంట్‌ను సిబ్బంది అడిగితే.. ఇంటి పన్ను చెల్లిస్తున్న రసీదులు మినహా మిగతావేవీ లేవని బదులిచ్చారు. చివరకు అతడి కుటుంబ సభ్యుల పేరిట గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు అధికారులు అంగీకరించారు. అయితే.. ప్రభుత్వానికి చెల్లించాల్సిన చలానా కాకుండా అదనంగా డాక్యుమెంట్‌కు రూ.4 వేలు, దస్త్రాలు లేకుండా ఇంటి నంబర్‌పై రిజిస్ట్రేషన్ చేస్తున్నందుకు మరో రూ.20వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో సదరు వ్యక్తి రూ.24 వేలు ముట్టజెప్పారు.

నిఘా

ఈటీవీ, ఖమ్మం, న్యూస్‌టుడే, ఖమ్మం గ్రామీణం: ఖమ్మం గ్రామీణ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అడిగినంత చెల్లిస్తేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ సజావుగా సాగుతుంది. లేదంటే రోజుల తరబడి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి ఉంటుంది. దీని పరిధిలో ఖమ్మం గ్రామీణం, చింతకాని, ముదిగొండ, కామేపల్లి, కారేపల్లి మండలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. ప్రస్తుతం ఈ కార్యాలయంలో రోజూ 15-20 డాక్యుమెంట్ల వరకు రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. స్థిరాస్తి వ్యాపారం జోరుగా ఉన్న సమయంలో 200 వరకు డాక్యుమెంట్లు జరిగేవి. ప్రతి పనికి ఓ ధర నిర్ణయించి దర్జాగా దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నా.. ఏదో ఒక సాకు చెప్పి వసూళ్లకు పాల్పడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తనఖా రిజిస్ట్రేషన్‌కు ఆస్తి విలువను బట్టి దండుకుంటుండగా, ఈసీ పత్రానికి రూ.500 తీసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.



ఖమ్మం గ్రామీణ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

డబ్బు వసూళ్లకు ఓ ఉద్యోగి

రోజూ ఏ డాక్యుమెంట్ రైటర్ నుంచి ఏఏ డాక్యుమెంట్లు వచ్చాయో ఓ పుస్తకంలో నమోదు చేసుకుని ఇళ్లు, ప్లాట్లకు వేర్వేరుగా వసూళ్లకు పాల్పడుతున్నారు. సాయంత్రం కాగానే డాక్యుమెట్ రైటర్ల నుంచి డబ్బులు వసూలు చేసేందుకు ప్రత్యేకంగా ఓ ఉద్యోగిని నియమించుకున్నారు. మళ్లీ రిజిస్ట్రేషన్ కోసం వస్తే కొర్రీలు పెడతారేమోనని భయపడి.. అడిగిన డబ్బు ముట్టజెప్పి గుట్టుచప్పుడు కాకుండా పనులు చేయించుకుంటున్నారు. ఖమ్మం గ్రామీణ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అడ్డాగా సాగుతున్న దోపిడీ పర్వంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

అన్ని డాక్యుమెంట్లు సక్రమంగా ఉంటేనే రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం. రిజిస్ట్రేషన్‌కు డబ్బులు ఎందుకు అడుగుతాం. ఎవరినీ డబ్బులు డిమాండ్ చేయటం లేదు. - అరుణ, సబ్ రిజిస్ట్రార్

అక్టోబరు 3 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో గురువారం సమావేశమయ్యారు. అక్టోబరు 3 నుంచి 9 వరకు పదోతరగతి, ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. పదో తరగతి పరీక్షలకు 340 మంది, ఇంటర్ పరీక్షలకు 373 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. ఖమ్మంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి, రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంటర్ పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు కనీస వసతులు కల్పించాలని ఆదేశించారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి రవి బాబు, ఉప వైద్యాధికారి సైదులు, మున్సిపల్ సహాయ కమిషనర్ సంపత్ కుమార్ పాల్గొన్నారు.

అమ్మాయి చదువు భావితరాలకు వెలుగు: కలెక్టర్

ఖమ్మం సంక్షేమవిభాగం: 'మగ పిల్లవాడు చదువుకుంటే ఆ తరం బాగుపడుతుంది.. అమ్మాయి చదువుకుంటే ముందు తరాలకు స్ఫూర్తినిస్తుంది' అని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. ఖమ్మం పాత ధర్నాచౌక్‌లో వీరనారి చాకలి ఐలమ్మ జయంత్యుత్సవాలను బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి జి.జ్యోతి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి కలెక్టర్, అదనపు కలెక్టర్ శ్రీజ, బీసీ నాయకులు నివాళి అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో మార్పు కావాలని చాలామంది ఆశిస్తారని, ఆదిశగా పనిచేసిన గొప్ప వ్యక్తుల్లో చాకలి ఐలమ్మ ఒకరని కొనియాడారు. బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత, డీసీసీబీ మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషయ్య, కె.శ్రీలక్ష్మీ, దుంపటి నగేశ్, మేకల సుగుణారావు, గాలి అంజయ్య, పిండిప్రోలు రామ్మూర్తి, జక్కుల వెంకటరమణ పాల్గొన్నారు.



ఐలమ్మ విగ్రహానికి నివాళి అర్పించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ పి.శ్రీజ తదితరులు

విభేదాలకు ఆజ్యం పోసిన వ్యాఖ్యలు

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: ఓ యూట్యూబర్ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. వివాదం చినికిచినికి గాలివానలా మారి గ్రామంలో విభేదాలకు ఆజ్యం పోశాయి. చివరకు సామాజిక బహిష్కరణలకు దారితీశాయి. కొన్ని రోజులుగా చోటుచేసుకుంటున్న పరిణామాల తాలూకు వివరాలిలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలానికి చెందిన గ్రామంలో ఓ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు ఇటీవల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక వ్యక్తి, కవరేజీ నిమిత్తం తనకు తెలిసిన యూట్యూబర్‌ను ఈ నెల 16న పిలిపించారు. యూట్యూబర్ మాటల క్రమంలో ఓ వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీనిపై వివరణ కోరేందుకు కొందరు మరుసటి రోజు అతణ్ని ఫోన్‌లో సంప్రదించగా సదరు వర్గం విశ్వాసాలపై దుర్భాషలాడాడు. దీనికి సంబంధించిన ఆడియో రికార్డులు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. ఈ క్రమంలో ఓ సామాజిక వర్గం ఐక్యమై గ్రామస్థుల దహన సంస్కారాలకు వెళ్లకుండా ఆగిపోయింది. ఇటీవల ఇద్దరు వ్యక్తులు చనిపోగా దహన సంస్కారాల క్రతువులో పాల్గొనలేదు. ఎవరో ఏదో మాట్లాడితే ఇలా చేయటం తగదని మిగిలిన సామాజికవర్గాల వారు చర్చించారు. చివరకు విభేదాలు ముదిరి ఓ సామాజికవర్గ కూలీలు, హమాలీలను పనుల్లోకి రానీయమంటూ తీర్మానించారు. ఇందులో భాగంగా బుధవారం శుభకార్యానికి హాజరైన వాయిద్యకారుల బృందంలో ఉన్న ఓ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని అడ్డుకుని మిగిలిన వారిని అనుమతించారు. రెండోవైపు సదరు యూట్యూబర్‌పై ఫిర్యాదుకు పాలేరు నియోజకవర్గానికి చెందిన ఓ వర్గం ప్రతినిధులు బుధవారం ఠాణాకు వెళ్లారు. ఈ వివాదాన్ని గ్రామస్థాయిలో పరిష్కరించుకోవాలని పోలీసులు వారిని వెనక్కి పంపించారు. పరిస్థితుల తీవ్రత నేపథ్యంలో ఖమ్మం గ్రామీణ ఏసీపీ తిరుపతిరెడ్డి, కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్సై సంతోష్ తదితరులు గ్రామంలో గురువారం విచారణ చేపట్టారు. కొంతమంది స్థానిక నాయకులతో మాట్లాడి వివాదం సద్దుమణిగించేందుకు చర్చలు జరిపారు. సదరు యూట్యూబర్, ఆయన్ను పిలిపించిన వ్యక్తి రాజీకి రాలేదని తెలుస్తోంది.

కవ్వింపా..
యుద్ధానికి సన్నద్ధమా..?



చర్ల, న్యూస్‌టుడే

ఛత్తీస్‌గఢ్- తెలంగాణ సరిహద్దు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పూసుగుప్ప సీఆర్పీఎఫ్ బేస్ క్యాంపుపై మావోయిస్టులు అనూహ్యంగా కాల్పులకు తెగబడటం కలకలం రేపింది. బుధవారం రాత్రి 7 గంటల నుంచి మావోయిస్టుల కాల్పులు మొదలవటంతో క్యాంపులోని భద్రతా బలగాలు అప్రమత్తమై దీటుగా బదులిచ్చాయి. ఈఘటనపై కేసు నమోదు చేశామన్న సీఐ రాజువర్మ.. అరగంట పాటు కాల్పులు జరిగాయని వెల్లడించారు. మావోయిస్టులు బీజీఎల్(బ్యారెల్ గ్రేనేడ్ లాంచర్)లను వినియోగించినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. చుట్టుపక్కల సెర్చింగ్ ఆపరేషన్ సాగుతోందని తెలిపారు. పూసుగుప్ప ఘటన నేపథ్యంలో భద్రాద్రి మన్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఛత్తీస్‌గఢ్ వైపు నుంచి తెలంగాణకు వచ్చేవారిని నిశితంగా తనిఖీ చేస్తున్నారు. బాంబ్‌స్క్వాడ్ బృందాలను రంగంలోకి దించారు. కేంద్ర పారామిలిటరీ బలగాలు చర్ల నుంచి పూసుగుప్ప రహదారి వెంట ఆర్వోపీ(రోడ్ ఓపెనింగ్ పార్టీ) బృందంతో క్షుణ్ణంగా తనిఖీలు సాగిస్తున్నాయి. పూసుగుప్ప బేస్ క్యాంపు చుట్టుపక్కల అటవీ ప్రాంతాన్ని భద్రతా బలగాలు తమ ఆధీనంలోకి తెచ్చుకున్నాయి. భద్రతా బలగాలు వస్తాయనే అంచనాతో మావోయిస్టులు అడవుల్లో ఐఈడీ(ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్)లను పెట్టారనే అనుమానంతో బీడీఎస్ బృందాలను రంగంలోకి దించారు.

భద్రాద్రి ఏజెన్సీలో అప్రమత్తం

కొద్దిరోజులుగా ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టుల కోటలో భద్రతా బలగాలు పాగా వేస్తున్నాయి. నక్సల్స్ ప్రభావిత దండకారణ్యంలో బేస్‌క్యాంపుల ఏర్పాటు శరవేగంగా సాగుతోంది. ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ కీలక స్థావరాల్లో బేస్ క్యాంపుల ఏర్పాటుకు అడ్డుకట్ట వేయాలనే వ్యూహంతో మావోయిస్టులు పూసుగుప్ప బేస్ క్యాంపుపై కాల్పులకు పాల్పడి ఉంటారని నిఘావర్గాలు భావిస్తున్నాయి. ఓపక్క ఈనెల 21 నుంచి అక్టోబర్ 20 వరకు ఆవిర్భావ ఉత్సవాలకు మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. దండకారణ్యంలో ఉత్సవాలు జరుపుకొంటున్న తరుణంలో తెలంగాణలో పూసుగుప్ప క్యాంపుపై దాడికి పాల్పడటంలో ఆంతర్యమేంటో అంతుచిక్కటం లేదు. దండకారణ్యంలో భద్రతా బలగాలు, మావోయిస్టుల నడుమ ప్రచ్ఛన్నయుద్ధం సాగుతోంది. ఈసమయంలో ఇంత నిర్బంధంలోనూ మావోయిస్టులు తెలంగాణ సరిహద్దులోని పూసుగుప్ప బేస్ క్యాంపు సమీపానికి వచ్చి దాడికి ఒడిగట్టడమంటే పోలీసులకు సవాల్ విసిరినట్టే. ఈ ఏడాది జనవరి 16న ఛత్తీస్‌గఢ్‌లోని ధర్మారం, చింతవాగు, పామేడు బేస్ క్యాంపులపై మావోయిస్టులు ఏకకాలంలో భీకర దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. దాదాపు పది గంటలకు పైగా జరిగిన దాడులను భద్రతా బలగాలు సమర్థంగా తిప్పికొట్టాయి. నక్సల్స్ వ్యూహాత్మక దాడి తర్వాత ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలు అనుక్షణం అప్రమత్తంగా అడుగులు వేస్తున్నాయి. తాజాగా పూసుగుప్ప బేస్ క్యాంపుపై జరిపిన దాడిలో బీజీఎల్‌లను మావోయిస్టులు వినియోగించారు. దాడి వెనుక ఆంతర్యం తెలియకపోయినా భవిష్యత్తులో యుద్ధానికి దీనిని సన్నద్ధంగా భావిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ దాడికి ఛత్తీస్‌గఢ్‌లో యుద్ధతంత్రంలో నిష్ణాతులైన దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ(డీకేఎస్‌జడ్‌సీ) నేతృత్వం వహించినట్లు తెలుస్తోంది. పూసుగుప్ప ఘటనపై ఎస్పీ రోహిత్‌రాజు ఆరాతీశారు. భద్రాచలం ఏఎస్పీ అంకిత్‌కుమార్ సంక్వార్‌తో పాటు సీఆర్పీఎఫ్ ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. సరిహద్దు బేస్ క్యాంపులకు అదనపు బలగాలు రప్పిస్తున్నారు.




చర్ల- పూసుగుప్ప రహదారిపై సీఐ రాజువర్మ నేతృత్వంలో తనిఖీలు

DCCB KHAMMAM
ది జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ లి॥, ఖమ్మం.
మహాత్మాగాంధీ రోడ్డు, గాంధీ చౌక్, పి.బి.నెం.61, ఖమ్మం-507 003.
E-mail : dccbkmm@yahoo.com, web: www.khammamdccb.org

మహాజనసభ సమావేశపు నోటీసు

జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, రి.నెం.1384, ఖమ్మం యొక్క 125వ మహాజన సభ తేది.28.09.2024 శనివారం మ॥ 03.00 గంటలకు బ్యాంకు ప్రధాన కార్యాలయము, ఖమ్మంలోని టి.ఎస్.ప్రసాద్ సమావేశ మందిరమునందు బ్యాంకు అధ్యక్షులు గౌరవనీయులు శ్రీ దొండపాటి వెంకటేశ్వరరావు గారి అధ్యక్షతన ఏర్పాటు చేయనైనది. కావున, బ్యాంకులో సభ్యత్వము గల సభ్యులెల్లరు తప్పక హాజరు కావలయునని కోరడమైనది.
తేది : 26-09-2024 సం/-
ప్రదేశము : ఖమ్మం ముఖ్య కార్యనిర్వహణాధికారి

మీ ఆత్మీయులకు శుభాకాంక్షలు తెలపడం మరవకండి



వివరాలకు
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం
ఈనాడు కార్యాలయాలలోగాని, మీ దగ్గరలోని ఏజెంట్‌ను గాని సంప్రదించండి.
★ ఖమ్మం: 8008510764, 8008709925, 8008709924
★ కొత్తగూడెం, పాల్వంచ: 8008709920 ★ ఇల్లెందు, మధిర: 8008510764
★ మణుగూరు, భద్రాచలం: 8247668656 ★ పాలేరు: 8008709924
★ సత్తుపల్లి, అశ్వారావుపేట: 8008001776 ★ వైరా: 8008709925

(c) eenadu

వేదన మిగిల్చిన నైరుతి

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం, న్యూస్‌టుడే, కల్లూరు



వరద ఉద్ధృతికి కల్లూరు మండలంలో దెబ్బతిన్న రోడ్డు (పాత చిత్రం)

ఈ ఏడాది ఖమ్మం, భద్రాద్రి జిల్లాల వాసులకు నైరుతి రుతుపవనాలు వేదన మిగిల్చాయి. వీటి ప్రభావంతో జూన్ రెండో వారం నుంచి ఇప్పటివరకు కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. ఆగస్టు రెండో వారం వరకు మోస్తారు వర్షపాతం నమోదైనా.. ఆ తర్వాత తుపాను ప్రభావంతో కుండపోత వానల వల్ల ఉభయ జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. జూన్ మొదటి వారంలో రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించగా.. అదేనెల 15 నుంచి పూర్తిస్థాయిలో విస్తరించాయి. ఈనెలాఖరున నిష్క్రమిస్తాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. ఈసారి కురిసిన వర్షాలకు జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. ఉభయ జిల్లాల్లో పదుల సంఖ్యలో కాలనీలు జలమయమయ్యాయి. రహదారులు, కల్వర్టులు, వంతెనలు దెబ్బతినగా.. వేలాది ఎకరాల్లోని పంట పొలాల్లో ఇసుక మేటలు వేసి అన్నదాతలకు కడగండ్లు మిగిల్చాయి.

భారీ నుంచి అతిభారీ వర్షపాతం నమోదైన ప్రాంతాలు (మి.మీ.లలో)

◆ మండలం ◆ సాధారణ వర్షపాతం ◆ వాస్తవంగా కురిసింది

మండలం	సాధారణ వర్షపాతం	వాస్తవంగా కురిసింది
తిరుమలాయపాలెం	735.7	1,176.2
కల్లూరు	831.9	1,337.0
వేంసూరు	810.3	1,489.7
మధిర	701.9	1,185.6
మణుగూరు	1059.3	1,698.4
ఆళ్లపల్లి	845.7	1,405.3

ఘొల్లుమన్న ఖమ్మం

నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు నమోదయ్యాయి. జిల్లాలో వానాకాలంలో సాధారణ వర్షపాతం 783.8 మిల్లీమీటర్లు కాగా.. 1,128.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. తిరుమలాయపాలెం, కల్లూరు, వేంసూరు, మధిర ప్రాంతాల్లో 60శాతానికి పైగా అధికంగా వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా ఏన్కూర్ మినహా మిగతా మండలాల్లో మిగులు వర్షపాతం నమోదైంది. ప్రధానంగా ఈనెల మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు ఆకేరు, మున్నేరు నదులు పొంగటంతో అనేక ప్రాంతాల్లో సాధారణ ప్రజలు, అన్నదాతలతో పాటు ప్రభుత్వ ఆస్తులకు తీరని నష్టం వాటిల్లింది. ప్రాణనష్టమూ సంభవించింది.

మునిగిన మణుగూరు.. తెగిన పెద్దవాగు

ఖమ్మం జిల్లాతో పోల్చితే నైరుతి రుతుపవనాల ప్రభావం భద్రాద్రి జిల్లాలో తక్కువైనప్పటికీ కొన్నిచోట్ల కురిసిన భారీ వర్షాల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జులైలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడటంతో గుమ్మడివల్లి, తుపాను ప్రభావం వల్ల మణుగూరు, బుగ్గవాగు పొంగటంతో ఇల్లెందులోని కొన్ని కాలనీల్లోకి వరదనీరు చేరి ప్రజలు నిరాశ్రయులయ్యారు. భద్రాద్రి జిల్లాలో ఈ ఏడాది సాధారణ వర్షపాతం 947 మిల్లీమీటర్లు కాగా.. 1,240.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. ప్రధానంగా మణుగూరు, ఆళ్లపల్లిలో సాధారణం కంటే 60 శాతానికి పైగా వర్షం కురిసింది. 23 మండలాల్లో పదకొండు మండలాల్లో సాధారణ, 10 మండలాల్లో మిగులు వర్షపాతం నమోదైంది.

రోడ్లు ధ్వంసం.. ఒళ్లు హూనం..!



సదాశివునిపాలెం శివారులో సా..గుతున్న వంతెన నిర్మాణ పనులు

ఇటీవల కురిసిన భారీ వర్షాల ధాటికి కొన్నిచోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. కల్వర్టులు ధ్వంసమయ్యాయి. అయితే వీటికి మరమ్మతులు చేపట్టకపోవటం వల్ల రాకపోకల సమయంలో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్నిచోట్ల ఇతరత్రా పనుల కోసం రోడ్లను తవ్వి వదిలేశారు. అధికారులు స్పందించి తక్షణం మరమ్మతులకు పూనుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఈనాడు టాస్క్‌ఫోర్స్

నత్త నడకే నయం

సత్తుపల్లి నుంచి వేంసూరు మండలం వెంకటాపురం వరకు సుమారు 13 కిలోమీటర్ల మేర రోడ్డుతోపాటు సదాశివునిపాలెం శివారులో వంతెన నిర్మాణ పనులను గతేడాది ఏప్రిల్‌లో రూ.27 కోట్లు మంజూరయ్యాయి. నాలుగు కానాలతో ప్రారంభించిన వంతెన పనులు వర్షం కారణంగా అంతంతమాత్రంగా సాగుతున్నాయి. రాకపోకల సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వచ్చిన వరదలకు మట్టి రోడ్డుకు గండి పడటంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గండిని అధికారులు పూడ్చించటంతో రాకపోకలు సాగుతున్నాయి.. ప్రయాణికులకు ఇబ్బందులు మాత్రం తప్పటం లేదు. ఈఅంశంపై ఆర్‌అండ్‌బీ జేఈ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వర్షాల కారణంగా పనుల్లో జాప్యం నెలకొందని, జనవరిలోగా పనులన్నీ పూర్తిచేస్తామన్నారు. – సత్తుపల్లి, న్యూస్‌టుడే

తవ్వారు.. వదిలేశారు..!

సూర్యాపేట- ఖమ్మం ప్రధాన రహదారి వారగా ఓ ప్రైవేట్ నెట్‌వర్క్ కంపెనీ కేబుల్ ఏర్పాటు కోసం తవ్వకాలు జరుగుతున్నాయి. పాలేరు గ్రామం వద్ద చేపట్టిన పనుల్లో జాప్యం కారణంగా వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇదే గ్రామంలో జుజ్జులరావుపేట, నర్సింహులగూడెం గ్రామాలకు వెళ్లే రహదారి కూడలిలో తవ్వి వదిలేసిన గోతుల్లో ఇటీవల ఒక ద్విచక్రవాహనం దూసుకెళ్లటంతో చోదకుడు తీవ్రంగా గాయపడ్డారు. వాహనం దెబ్బతింది. మరో చోట రెండు గేదెలు జారిపడి గాయాలపాలయ్యాయి. సదరు కేబుల్ నిర్వాహకులతో మాట్లాడి పనులు వేగవంతమయ్యేలా చూస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈ దేవేందర్ తెలిపారు. – కూసుమంచి, న్యూస్‌టుడే



పాలేరులో కేబుల్ ఏర్పాటు కోసం తవ్విన కాల్వలోకి దూసుకెళ్లిన ద్విచక్ర వాహనం (పాత చిత్రం)



అశ్వారావుపేటలో..

16 నెలలుగా అదే సమస్య

రూ.13.50 కోట్లతో రహదారిని విస్తరించాలని, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, మురుగు కాల్వలు నిర్మించాలని అశ్వారావుపేటలో అయ్యర్ హోటల్ నుంచి సంతపాకల వరకు రోడ్డు పక్కన తవ్వారు. సగం తవ్వాక మంచినీటి పైపులైన్ మార్చేందుకు నిధులు కావాలంటూ పనులను నిలిపేశారు. రోడ్డుపైనే వాహనాలు నిలపాల్సి రావటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. 16 నెలలుగా ఈ సమస్య వేధిస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఈఅంశంపై ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాస్ మాట్లాడుతూ తవ్విన చోట వారం రోజుల్లో చదును చేయిస్తామన్నారు. – అశ్వారావుపేట, న్యూస్‌టుడే

కల్వర్టు తొలగింపుతో ఇక్కట్లు

భద్రాచలం శివారులోని జగదీశ్‌కాలనీ నుంచి రాజుపేటకాలనీకి వెళ్లే మార్గంలో కల్వర్టును తొలగించారు. దాదాపు నెల నుంచి ఈమార్గం గుండా నడవటానికీ వీల్లేకుండా పోయింది. రామాలయ చెరువు నీరు ఈ కల్వర్టు గుండా ప్రధాన డ్రైన్లలో కలుస్తుండేది. గత నెలలో వచ్చిన వర్షానికి మురుగుకాల్వలు పొంగిపొర్లటంతో చుట్టుపక్కల ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. సమస్య తీవ్రతను తగ్గించేందుకు కల్వర్టును తొలగించారు. మళ్లీ దీన్ని నిర్మించకపోవటంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. రూ.50వేలు ఖర్చు పెడితే ఇది బాగవుతుంది. త్వరలోనే దీన్ని పునరుద్ధరిస్తామని గ్రామపంచాయతీ ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. – భద్రాచలం, న్యూస్‌టుడే




భద్రాచలం జగదీశ్ కాలనీలో రోడ్డును తవ్వి వదిలేశారిలా..

'మీ చెంతకే భవిష్యనిధి' నేడు

ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 'మీ చెంతకే భవిష్య నిధి(నిధి ఆప్‌కే నికట్)' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని అధికారులు రబీలాల్ దాస్, కె.సునీల్ తెలిపారు. ఖమ్మం జిల్లావాసులు మధిర పంచాయతీ కార్యాలయం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులు కొత్తగూడెం పట్టణంలోని త్రివేణి హైస్కూల్లో ఉదయం 9 గంటలకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



రాము

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: రోడ్డు పక్కన నిలబడి మాట్లాడుతున్న వారిని లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన ఓ వ్యక్తి చికిత్స కోసం తరలిస్తుండగా మరణించాడు. గురువారం తెల్లవారుజామున త్రీ ఇంక్లైన్ రేడియో స్టేషన్ వద్ద చోటుచేసుకున్న సంఘటన వివరాలు రెండో పట్టణ పోలీసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. సింగరేణి ప్రధాన ఆసుపత్రి ఏరియా గౌతంనగర్ కాలనీకి చెందిన మిద్దె రాము (45) ఆసుపత్రి ఏరియాలో హోటల్ నిర్వహిస్తున్నారు. గురువారం అర్ధరాత్రి దాటాక ఇసుక ట్రాక్టర్‌తో పాటు రేడియో స్టేషన్ వద్దకు వెళ్లారు. అక్కడ ఇసుక డంప్ అనంతరం కిరాయి విషయమై ట్రాక్టర్ డ్రైవర్, కొనుగోలుదారుతో మాట్లాడుతుండగా.. అదే సమయంలో నూజివీడు నుంచి రాయ్‌పూర్‌కి చేపల మేత లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ ట్రాక్టర్‌ను, ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ఇంజిన్, బాడీ మధ్య రాము ఇరుక్కుపోయాడు. కాలు విరిగి, తలకు తీవ్రగాయాలయ్యాయి. అతణ్ని అక్కడున్నవారు కొత్తగూడెంలోని జిల్లా సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స నిర్వహించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించాలని సూచించారు. ఖమ్మం తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో రాము మరణించారు. ఆయనకు భార్య, బీటెక్, ఇంటర్ చదివే ఇద్దరు కుమారులున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ కిందకు దూకడంతో స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. అతివేగంతో ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ నాగుల్‌మీరాపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బావిలో పడి వృద్ధుడు..



కృష్ణ

కల్లూరు, న్యూస్‌టుడే: కల్లూరు పట్టణం పుల్లయబంజరు రోడ్డులో నివాసముంటున్న నన్నా కృష్ణ (73) అనే వృద్ధుడు బావిలో పడి మృతి చెందాడు. మతిస్థిమితం లేని అతను బుధవారం ఇంటినుంచి వెళ్లిపోవటంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం సమీపంలోని బావిలో శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుబల్లి ప్రభుత్వాసుపత్రికి పంపారు. భార్య బ్రహ్మానందమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై షాకీర్ తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

కరకగూడెం, న్యూస్‌టుడే: పురుగు మందు తాగి విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కరకగూడెం పోలీస్ ఠాణాలో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కరకగూడెం మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని(17) భద్రాచలం కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఇటీవల ఇంటికి వచ్చిన ఆమె కళాశాలకు వెళ్లడం లేదు. దీంతో తల్లి కళాశాలకు వెళ్లాలని మందలించడంతో ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. విద్యార్థిని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్ ఠాణాలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

ఉరి వేసుకుని యువతి..

తల్లాడ, న్యూస్‌టుడే: నూతనకల్ గ్రామానికి చెందిన ఓ యువతి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పదో తరగతి వరకూ చదువుకున్న చలమల అనూష(20) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో బలవన్మరణానికి పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం మధిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అప్పుల బాధతో ప్రైవేటు బ్యాంకు ఉద్యోగి..



రాజు

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: అప్పుల బాధ, ఒత్తిళ్లు లేక ఓ ప్రైవేటు బ్యాంకు ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గాజులరాజం బస్తీలో గురువారం చోటు చేసుకుంది. మూడవ పట్టణ పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. జీఆర్‌బస్తీకి చెందిన వడ్లకొండ రాజు (37) కొత్తగూడెం ఓ ప్రైవేటు బ్యాంకులో క్రెడిట్‌కార్డు కలెక్షన్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆర్థిక పరమైన ఇబ్బందులతో పాటు అప్పులు పెరిగిపోవడంతో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన రాసిన ఆత్మహత్య లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భార్య నాగప్రసన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. మృతుడికి రెండేళ్ల బాబు ఉన్నాడు.

ఇన్‌ఫార్మర్ నెపంతో హత్య

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలో మావోయిస్టులు దారుణానికి ఒడిగట్టారు. బెజ్జీ పోలీసుస్టేషన్ పరిధిలోని భండార్ పదర్ గ్రామానికి చెందిన సోయం పాండు(53) అనే వ్యక్తిని ఇన్‌ఫార్మర్ నెపంతో హత్య చేశారు. ఇంట్లో నిద్రిస్తున్న పాండును బుధవారం రాత్రి మావోయిస్టు పదునైన ఆయుధంతో హత్య చేశారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గురువారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: ప్రేమ పేరుతో బాలికను లోబర్చుకుని గర్భవతిని చేసిన నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఆళ్లపల్లి ఎస్సై రతీశ్ తెలిపారు. స్థానిక పోలీసు ఠాణాలో గురువారం ఎస్సై వివరాలు వెల్లడించారు. ఇల్లెందు పట్టణానికి చెందిన ఓ బాలిక(మైనర్) ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటోంది. ఆ బాలిక బంధువులైన ఆళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన దారం కార్తీక్‌తో కొంతకాలం ప్రేమలో ఉన్నట్లు తెలిపారు. బాలికను శారీరకంగా లోబర్చుకోవడంతో గర్భవతి అయినట్లు పేర్కొన్నారు. కొన్ని రోజు తర్వాత బాలిక జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపింది. ఆళ్లపల్లి పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేయగా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

డైరెక్టర్ (ఈ,ఎం) పదవీ కాలం పొడిగింపు

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: డైరెక్టర్ (ఎలక్ట్రికల్, మెకానికల్) డి.సత్యనారాయణరావును డైరెక్టర్‌గా మరో 11 నెలల 6 రోజులు పొడిగిస్తూ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఉద్యోగ విరమణ చేయనున్న వచ్చే సంవత్సరం ఆగస్టు 31 దాకా డైరెక్టర్(ఈ,ఎం)గా కొనసాగించనున్నారు. గురువారం పలువురు అధికారులు సత్యనారాయణరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీఎం జక్కం రమేశ్, అధికారులు దిలీప్‌కుమార్, మనోజ్‌కుమార్, మీనాజుద్దీన్, కార్తీక్‌శర్మ, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు రోగులకు ఏకకాలంలో..

థైరాయిడ్ గ్రంథుల తొలగింపు



శస్త్ర చికిత్సలు చేస్తున్న వైద్యులు

కొత్తగూడెం వైద్యవిభాగం: సర్వజన ఆసుపత్రిలో ఒకేసారి ఇద్దరు రోగులకు సంక్లిష్టమైన శస్త్రచికిత్సలను వైద్యులు గురువారం నిర్వహించారు. ఇల్లెందుకు చెందిన గుడిపెల్లి శశికళ (36) థైరాయిడ్‌తో బాధపడుతోంది. గొంతు భాగం వాపెక్కి ఇబ్బంది పడుతున్న ఆమెకు క్యాన్సర్ వచ్చే ప్రమాదముందని వైద్యులు గుర్తించారు. మణుగూరు సుందరయ్యనగర్ కాలనీకి చెందిన ఐనాల రవి (52) ఇదే సమస్యతో బాధపడుతున్నాడు. వీరిద్దరికీ ఏకకాలంలో శస్త్రచికిత్స చేసి గ్రంథులను తొలగించారు. వైద్య బృందంలో జనరల్ సర్జన్ నవ్యదీప్, ఈఎన్‌టీ సర్జన్ శాంసన్ (హెచ్‌ఓడీ ప్రొఫెసర్), అసిస్టెంట్ ప్రొఫెసర్ రవి, మత్తు వైద్యనిపుణులు రమేశ్, రాము, ఉన్నారు.

తండ్రి దస్త్రాలు ఇచ్చి వస్తూ.. అనంత లోకానికి



షారూఖ్

ఎర్రుపాలెం, మధిర: తండ్రి కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యారు. తాను చేస్తున్న ఉద్యోగానికి ఐచ్ఛిక విరమణ చేయాలని నిర్ణయించుకున్నారు. దీనికి సంబంధించిన దస్త్రాలన్నీ సిద్ధంచేసి తండ్రి పనిచేసే పాఠశాలలో ఇచ్చి వస్తూ రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. మధిరలోని చెరుకుమల్లి వారి వీధిలో నివాసం ఉండే షేక్ గౌస్ మడుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో యూడీసీగా పనిచేస్తూ ఎర్రుపాలెం మండలం మీనవోలు జడ్పీ ఉన్నత పాఠశాలకు ఇటీవల బదిలీ అయ్యారు. ఇతను మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నారు. హైదరాబాద్‌లో ఆగస్టులో శస్త్రచికిత్స చేశారు. మంచానికే పరిమితమైన గౌస్ ఐచ్ఛిక ఉద్యోగ విరమణకు అనుమతివ్వాలంటూ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు సంబంధించి దస్త్రాలు, మెడికల్ బిల్లులను మీనవోలు పాఠశాలలో ఇచ్చేందుకు కుమారుడు షారూఖ్ గురువారం బైక్‌పై వెళ్లాడు. వాటిని పాఠశాలలో అప్పగించిన అనంతరం తిరిగొస్తుండగా అదే గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. షారూఖ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ సోదరి ఉన్నారు. తల్లి బేగం విద్యుత్తు సంస్థలో ఉద్యోగిగా మధిరలో పనిచేస్తున్నారు. ఓవైపు భర్త అనారోగ్యం, చేతికందిన కుమారుడు మృతిచెందటంతో ఆమె కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

గడ్డి పొదల్లో గంజాయి పొట్లాలు



సుజాతనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రీయ రహదారి పక్కన గడ్డి పొదల్లో గంజాయి పొట్లాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వేపలగడ్డ ఆర్వోబీ వంతెన సమీపంలో రోడ్డు పనులు నిర్వహిస్తున్న కూలీలు.. అక్కడున్న గడ్డి పొదల్లో చేతి సంచి, బంతుల ఆకారంలో ప్యాకింగ్ చేసిన పొట్లాలను గమనించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఇంటి యజమాని ఒకరు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్సై జుబేదాబేగం వెళ్లి తనిఖీలు చేయగా సంచుల్లో 5 కిలోల గంజాయి లభ్యమైంది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతం నుంచి తరలించే క్రమంలో.. స్థానికంగా చేపట్టిన తనిఖీలకు భయపడి నిందితులు సంచులను పడేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేశారు.

ఉద్యోగాల పేరుతో వంచన?

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం చేసిన సంఘటన ఖమ్మం నగరంలో తాజాగా వెలుగు చూసింది. డబ్బు చెల్లించి, ఉద్యోగం రాక కాళ్లరిగేలా తిరుగుతున్న బాధితుల్లో కొందరు ఖానాపురం హవేలి పోలీసులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. ఖమ్మం నగరానికి చెందిన ఓ వ్యక్తి, భద్రాచలానికి చెందిన ఓ మహిళతో కలిసి ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులను నమ్మించారు. ఒక్కొక్కరి నుంచి సుమారు రూ.3 లక్షలు తీసుకున్నట్లు సమాచారం. నెలలు గడుస్తున్నా ఉద్యోగం రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన నగరానికి చెందిన ఇద్దరు నిరుద్యోగులు పోలీసుల దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిసింది. మోసపోయిన నిరుద్యోగుల సంఖ్య భారీగా ఉందని, వారు కూడా పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. దీనిపై ఖానాపురం హవేలి ఇన్‌స్పెక్టర్ భానుప్రకాశ్‌ను సంప్రదించగా తమ దృష్టికి రాలేదన్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారణ చేస్తామని, వెంటనే తమను సంప్రదించాలని సూచించారు.

నాడు చెత్తకుప్పల వెంట.. నేడు ఆత్మీయుల చెంత





కుటుంబ సభ్యులతో నాగేశ్వరరావు (మెడలో కండువా ఉన్న వ్యక్తి)

ఈ ఏడాది జనవరి నెల.. నేలకొండపల్లి మండల కేంద్రంలో రోడ్ల వెంట ఓ వ్యక్తి సంచరించేవాడు. మతిస్థిమితంలేని అతను బైపాస్ వంతెనకింద నిద్రించేవాడు. రాత్రి వేళల్లో అటుగా వెళ్లే వారు ఏమైనా ఇస్తే తినేవాడు. లేకుంటే పస్తులుండేవాడు. తర్వాత అతని జాడలేదు. ఈ నేపథ్యంలో కొన్ని నెలల తర్వాత గురువారం నేలకొండపల్లిలో మళ్లీ ప్రత్యక్షమయ్యాడు. కానీ రూపం మారింది. శుభ్రమైన దుస్తులతో తేటతెల్లంగా దర్శనమిచ్చాడు. గతం గురించి నోరువిప్పాడు. అతను, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా కొమరోలు మండలం వట్టిదేపమానిపల్లె గ్రామానికి చెందిన జెర్రిపోతుల నాగేశ్వరరావు.. నలుగురు సిబ్బందికి జీతాలిస్తూ, రోజూ 400 లీటర్ల పాలను విక్రయించే స్థితిలో ఉండేవారు. కుటుంబ పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులతో సతమతమై ఇల్లు వదిలివెళ్లాడు. మతిస్థిమితం కోల్పోయి నేలకొండపల్లి చేరుకున్నాడు. రెండు, మూడు నెలలుగా ఇక్కడే ఉంటున్నట్లు గమనించి స్థానికులు ఖమ్మంలోని అన్నం సేవా ఆశ్రమానికి సమాచారం అందించారు. అన్నం అతణ్ని చేరదీసి సపర్యలు చేశారు. చికిత్స ద్వారా మామూలు మనిషిగా మార్చారు. పేరు, వివరాలు కనుక్కొని అక్కడి పోలీసుల సహకారంతో కుటుంబ సభ్యులను రప్పించారు. ఏడాదిన్నర అన్వేషణ అనంతరం కనిపించిన తమ మనిషిని చూసి కుటుంబ సభ్యులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. నేలకొండపల్లి ప్రధాన కూడలిలో ఏఎస్ఐ కోడెత్రాచు, రెవెన్యూ అధికారుల సమక్షంలో అన్నం.. నాగేశ్వరరావును కుటుంబీకులకు అప్పగించారు. అన్నంను స్థానికులు అభినందించారు. – నేలకొండపల్లి, న్యూస్‌టుడే

చికెన్ ధరలు వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

కొత్తది కొట్టుకుపాయె.. పాత వంతెనే దిక్కాయె



ఆకేరు లోలెవల్ వంతెనపై రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు



కస్నాతండాలో ఆనవాళ్లు కోల్పోయిన పంట పొలాలు



రాళ్లురప్పల మధ్య పొలం పనికి నాగలితో వెళ్తున్న రైతు

ఖమ్మం- మహబూబాబాద్ జిల్లాల సరిహద్దులో ప్రధాన రహదారిపై నిర్మించిన ఆకేరు కొత్త వంతెన (హైలెవల్ వంతెన) ఇటీవల వరద ఉద్ధృతికి కొట్టుకుపోయింది. వంతెన చుట్టుపక్కల వాల్యాతండా, కస్నాతండాతో పాటు ఖమ్మం గ్రామీణ మండలంలో సుమారు 2వేల ఎకరాల్లో పత్తి, వరి, మిరప, కూరగాయల పంటలు కొట్టుకుపోయి రైతులకు భారీగా నష్టం వాటిల్లింది. వరద ఉద్ధృతికి హైలెవల్ వంతెనతోపాటు రహదారి ధ్వంసమైంది. తదనంతరం లోలెవల్ వంతెనను వినియోగంలోకి తెచ్చేలా రహదారిని అధికారులు అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం పాత వంతెన మీదుగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. – ఈనాడు, ఖమ్మం, న్యూస్‌టుడే, ఖమ్మం గ్రామీణం

EENADU eClassifieds

EDUCATION

గజం 2500/- మాత్రమే, విజయవాడ హైవే, నార్కట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటి వెంచర్‌లో స్విమ్మింగ్‌పూల్, కాటేజి మరియు 30 పండ్ల మొక్కలు 30 ఎర్రచందనం మొక్కలతో '1210' గజాలు (10 గుంటలు) ప్లాట్ అమ్మబడును. సంప్ర. 93463 63436.

రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech, డిప్లొమా, D&B-ఫార్మసీ, D.Ed, B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc(Agri), B.Sc (నర్సింగ్), GNM. Ph:8866977112, 339

REAL ESTATE

HOUSE FOR SALE

ఖమ్మం పట్టణంలో శాంతినగర్, మిషన్ హాస్పిటల్ ఎదురుగా 500 గు॥ విస్తీర్ణంలో, 250 గు॥ ఇల్లు, 250 గు॥ ఖాళీ స్థలంతో అమ్మబడును. Cell No: 7981828101.

ఖమ్మం 220 గజాలు G+1 బిల్డింగు వెస్ట్ ఫేసింగ్ 2 కార్‌లు పార్కింగ్. విడివిడిగా 1BHK మరియు 2BHK అమ్మబడును. నేచర్ విహార్ వెంచర్, బల్లేపల్లి నందు కలదు. 9182091132.

PLOT FOR SALE

ఖమ్మంలో DTCP & RERA అప్రూవల్స్‌తో క్షేత్ర ధర్మస్థలి, ప్రణామం, గోల్డెన్ సిటి, సీతారామం వెంచర్స్‌లో ప్లాట్స్ కలవు. A.నవీన్‌రెడ్డి, సెల్: 9959872364.

JOBS

9247259202 (సెల్ నెం.) శ్రీ వెంకటేశ్వర ఎలక్ట్రికల్, భద్రాచలం షాప్‌లో పనిచేయుటకు హెల్పర్స్ కావలెను.

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు॥ ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15-40 వేలు. ఫ్రీ రూమ్+భో॥ Hyd. ✆ 7995365999.

ఖమ్మంలోని కార్పొరేట్ ఆఫీస్ నందు అకౌంటెంట్స్-4, క్యాషియర్స్-2, రిసెప్షనిస్ట్-2, టెలికాలర్స్-5, Front Office-2, కలెక్షన్- 4, మార్కెటింగ్- 4 కావలెను. ఖమ్మం. సెల్: 9490791669.

ప్రకటన చిన్నదైన స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ B/W రూ. 435/- మాత్రమే (GST అదనం)

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 8008510764
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9652211356

(c) eenadu

సత్తుపల్లి

•సత్తుపల్లి •మధిర •వైరా


ఆర్థిక సాయం అందిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు వెంకటేశ్

బాధితురాలికి సాయం

ఈనాడు కథనానికి స్పందన

సత్తుపల్లి, న్యూస్‌టుడే: అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఆశా కార్యకర్త చల్లపల్లి సుజాత అనారోగ్య పరిస్థితిపై 'చేతులెత్తి మొక్కుతున్నా... చేయూతనివ్వరూ' శీర్షికన గురువారం మానవీయ కథనం ప్రచురితం కాగా దాతలు స్పందించారు. ఎన్టీఆర్‌నగర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు కంభంపాటి వెంకటేశ్ రూ.5వేలు అందజేశారు. పలువురు దాతలు ఫోన్‌పే ద్వారా మరో రూ.8400 సాయం చేయగా మొత్తం రూ.13,400 అందింది.

ఎంఈఓకు సన్మానం

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన బి.మురళీమోహన్‌రావును మండల వనరుల కేంద్రంలో గురువారం యూటీఎఫ్ నాయకులు సన్మానించారు. సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.నాగరాజు, ఎ.కోటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, ఎల్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
సత్తుపల్లి : 93922 39905
మధిర : 98668 05652
వైరా : 76619 46938

సమస్య: జవహర్‌నగర్‌లోని శ్రీవేణుగోపాల స్వామి దేవాలయం పక్క రోడ్డు శివారులో డ్రైనేజీ పొర్లిపోతుంది. దుర్వాసనతోపాటు అపరిశుభ్రవాతావరణం నెలకొంది.
- సూరిబాబు, స్థానికుడు

సమాధానం: వెంటనే పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం.
బాబురావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్:
– సత్తుపల్లి, న్యూస్‌టుడే

'ఆర్యవైశ్యులకు అండగా ఉంటా'


వేదికపై ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుజాత, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, రాజశేఖర్

వైరా, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పేద ఆర్యవైశ్యుల కోసమే ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కల్వ సుజాత అన్నారు. వైరాలో మిట్టపల్లి రాఘవరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో అన్ని పార్టీల వారు అన్నిరకాలుగా ఆర్యవైశ్యుల్ని ఉపయోగించుకుంటున్నారని, రాజకీయ ప్రాధాన్యం తక్కువగా ఉందని రాబోయే రోజుల్లో రాజకీయ ప్రవేశం పెరగాలన్నారు. ఆర్యవైశ్యులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు అన్నివేళల సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపాలిటీ ఛైర్మన్ సూతకాని జైపాల్, కట్ల రంగారావు, మిట్టపల్లి నాగి, శీలం వెంకటరెడ్డి, ఏదునూరి సీతారాములు, అనుమోలు భాస్కరరావు, గ్రంధి ప్రవీణ్, మిట్టపల్లి శ్రీనివాసరావు, పెనుగొండ ఉపేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం చేరని వన మహోత్సవం

సత్తుపల్లి, మధిర, వైరా, న్యూస్‌టుడే

వర్షాకాలం పూర్తి కావస్తున్నా ప్రభుత్వం వన మహోత్సవంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలను పురపాలకాలు ఇంకా చేరుకోలేదు. సత్తుపల్లి, వైరా, మధిర మున్సిపాలిటీల్లో ప్రత్యేకంగా నర్సరీలను ఏర్పాటు చేసి ప్రణాళికాబద్ధంగా మొక్కలను పెంచి తొలకరి ప్రారంభంలో నాటేవారు. ఈ ఏడాది ఎక్కడా పూర్తి స్థాయిలో మొక్కలను పెంచలేదు. నాటలేదు.. ఎక్కువ శాతం పంచాయతీల్లోని వన నర్సరీల నుంచే తెప్పించారు. నాటిన వాటి రక్షణకూ చర్యలు కరవయ్యాయి. లక్ష్యం అందుకోవటంలో భాగంగా ఇంటింటికీ పంపిణీ చేసి మిన్నకున్నారు. మూడు పురపాలకాల్లో పరిస్థితిపై 'న్యూస్‌టుడే' బృంద కథనం.

సత్తుపల్లి

లక్ష్యం: 50 వేలు
నాటింది: 35 వేలు

❐ సత్తుపల్లి మున్సిపల్ పరిధిలో ఇంకా 15వేల మొక్కలు నాటాల్సి ఉంది.
❐ ఈ ఏడాది స్థానికంగా కాకుండా ఖమ్మం, కడియం నుంచి మొక్కలను తెప్పించారు. పంచాయతీలు, సింగరేణి ఆధ్వర్యంలో పెంచిన నర్సరీల నుంచీ తెప్పించి నాటుతున్నారు.
❐ గానుగ, మందార, వేపతోపాటు పలు రకాల పూల మొక్కలను ఇంటింటికీ పంపిణీ చేయగా ప్రజలు పెద్దగా ఆసక్తి చూపలేదు.
❐ దామెరచెరువు కట్టపై, రోడ్ల పక్కన, జవహర్‌నగర్, విరాట్‌నగర్ శివారు వంటి ప్రాంతాల్లో నాటిన మొక్కల చుట్టూ ట్రీగార్డులను ఏర్పాటు చేశారు. పర్యవేక్షణ లేక గేదెలు కొన్నింటిని ధ్వంసం చేయగా, ఇంకొన్ని ఎత్తుకుపోయారు. మిగిలిన చాలా ప్రాంతాల్లో ట్రీగార్డులు లేవు.
❐ కమిషనర్ ఎం.రవిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం పూర్తి చేస్తామని, స్థలాలను గుర్తించి గోతులు తీయిస్తున్నామన్నారు. విధిగా సంరక్షిస్తామన్నారు.


జవహర్‌నగర్ ప్రధాన రోడ్డులో నాటిన మొక్కలు

వైరా

లక్ష్యం: 55 వేలు.. నాటింది: 40 వేలు (అధికారులు చెబుతున్నది).. వైరా మున్సిపాలిటీ పరిధిలో 40వేల మొక్కలను నాటామని అధికారులు చెబుతున్నా దాదాపు 5వేల ఇళ్లకు ఇంటికి ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేసి చేతులు దులుపుకొన్నారు. సుమారు 8వేలు మాత్రమే బహిరంగ ప్రదేశాల్లో నాటారు.
★ గతంలో మున్సిపాలిటీ నర్సరీల ద్వారా పెంచినవి నాటగా ఈసారి ఎక్కువ పంచాయతీల నుంచే తెప్పించారు.
★మధిర, సత్తుపల్లి రహదారుల వెంట, విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు వేశారు. ట్రీగార్డులు సమకూర్చలేదు. పర్యవేక్షణ కరవైంది.
★పుర కమిషనర్ వేణు మాట్లాడుతూ ఈ ఏడాది ఆశాజనకంగానే మొక్కలు నాటామని, లక్ష్యాన్ని అధిగమిస్తామన్నారు.


వైరాలో డివైడర్‌పై..

మధిర

లక్ష్యం: 50వేలు పంపిణీ చేసింది: 22వేలు
నాటిన మొక్కలు: 5 వేలు

● వన మహోత్సవం కార్యక్రమం మధిర మున్సిపాలిటీలో మొక్కుబడిగా సాగింది. ●22 వార్డుల్లో కేవలం 5వేల మొక్కలు నాటారు. వార్డుకు వెయ్యి మొక్కలు చొప్పున 22వేలు పంపిణీ చేశారు. ఇంకా 23 వేలు మొక్కలు నాటాలి. ●అంత ఉపయోగకరంగా లేనివి అందించారని, పండ్ల రకాలు పంపిణీ చేస్తే ఉపయుక్తంగా ఉండేదని పట్టణవాసులు అభిప్రాయపడుతున్నారు. ●గతంలో నాటినవి నిర్లక్ష్యంగా వదిలేయటంతో వాటిలో చాలా చనిపోయాయి. ఆయా స్థానాల్లోనే ఈ ఏడాది కొత్తగా నాటారు.
● పర్యావరణ ఇంజినీరు సైదానాయక్ మాట్లాడుతూ వర్షాల కారణంగా లక్ష్యం చేరుకోలేకపోయామన్నారు. వార్డుల్లో మొక్కలు పంపిణీ చేశామన్నారు.


మధిర ఆర్వోబీ కింద ఈ ఏడాది నాటిన క్రోటన్స్ మొక్కలు

ఆరోగ్యశ్రీ కేసుల్లో పురోగతి ఉండాలి: డీసీహెచ్ఎస్


దస్త్రాలను పరిశీలిస్తున్న రాజశేఖర్‌గౌడ్

సత్తుపల్లి, న్యూస్‌టుడే: ఆరోగ్యశ్రీ కేసుల్లో అభివృద్ధి చూపాలని డీసీహెచ్ఎస్ రాజశేఖర్ గౌడ్ సూచించారు. సత్తుపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. భోజన నాణ్యతపై ఆరా తీశారు. క్యాజువాలిటీ, రక్తశుద్ధి కేంద్రం, వీసీడీసీ, డ్రగ్ స్టోర్‌ను సందర్శించి రికార్డులు, హాజరు పట్టికలను తనిఖీలు చేశారు. నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆసుపత్రి భవనం తుది దశకు చేరిందన్నారు. ఆసుపత్రిలో తాగునీటి సదుపాయం లేదని కొందరు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వైద్యులు సురేశ్‌నారాయణ, ప్రణయ్, రాజేశ్, సాత్విక్, జయలక్ష్మి, నారాయణమ్మ, సాంబశివరావు పాల్గొన్నారు.

పెనుబల్లి: ఏరియా వైద్యశాలను డీసీహెచ్ఎస్ రాజశేఖర్ గౌడ్ గురువారం సందర్శించారు. వైద్యులు, సిబ్బంది పనితీరుని రోగులనడిగి తెలుసుకున్నారు. సెక్యూరిటీ, పారిశుద్ధ్య సిబ్బందికి గుత్తేదారు రూ.10వేలు మాత్రమే ఇస్తున్నారని పౌరహక్కుల సంఘం జిల్లా నాయకులు కాటినేని శ్రీను ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. వైద్యశాల సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, వైద్యులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.30 వేల సాయం


అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌కు చెక్కు అందిస్తున్న నేరడ గ్రామస్థులు

చింతకాని, న్యూస్‌టుడే: ఖమ్మం వరద బాధితుల సహాయార్థం నేరడ వాసులు రూ.30,087 చెక్కును అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌కు గురువారం అందజేశారు. నేరడ గ్రామానికి చెందిన యువత వాట్సాప్ గ్రూప్ ద్వారా సేకరించిన నగదును ఖమ్మం కలెక్టరేట్‌లో చెక్కు రూపంలో అందజేశారు. దూసరి గోపాలరావు, గోగుల ఆదినారాయణ, షేక్ దస్తగిరి, పెరిక ప్రభాకర్, రాగం లింగబాబు పాల్గొన్నారు.

పీఆర్టీయూ మండల కమిటీ ఎన్నిక

వేంసూరు, న్యూస్‌టుడే: పీఆర్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చింతా కృష్ణయ్య, గడ్డం రాజశేఖరరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షునిగా బృందావనం సత్యనారాయణ, కార్యదర్శిగా రమేష్‌బాబు, మహిళా ఉపాధ్యక్షురాలిగా రోజారమణి నియమితులయ్యారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.వెంకటేశ్వర్లు, రంగారావు, ఉపాధ్యక్షుడు బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంచార ప్రయోగశాల కృత్యాలు

మధిర పట్టణం, న్యూస్‌టుడే: మడుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా సైన్స్ అధికారి డి.జగదీష్ సౌజన్యంతో సంచార విజ్ఞానశాస్త్ర ప్రయోగశాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్రయోగ కృత్యాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. ప్రయోగశాలకు రేపాకుల జగన్నాథం, చైతన్య సారథ్యం వహించారు. ప్రధానోపాధ్యాయుడు తోట నర్సింహారావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి: ఐద్వా

సత్తుపల్లి, న్యూస్‌టుడే: మహిళా రక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ అన్నారు. సిద్ధారంలో అంగోతు చిట్టెమ్మ, బొప్పన లక్ష్మిల అధ్యక్షతన గురువారం సంఘం అయిదో మహాసభ నిర్వహించారు. అనంతరం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా యలగం పార్వతి, జాజిరి జ్యోతిలతోపాటు మరో 13 మందితో కమిటీని ఎంపిక చేశారు. వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి తదితరులు పాల్గొన్నారు.

జేవీఆర్ కళాశాలలో ఎన్‌సీసీ ప్రవేశాలు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మొదటి సంవత్సర విద్యార్థులకు ఎన్‌సీసీ ప్రవేశాలను కల్పించారు. ఖమ్మంలోని తెలంగాణ 11వ బెటాలియన్ కమాండెంట్ సంజయ్‌కుమార్‌భద్ర ఆధ్వర్యంలో పోటీ పరీక్షలు నిర్వహించారు. 50 మందికి ప్రవేశాలు కల్పించారు. ప్రిన్సిపల్ ఎన్.గోపీ, అడ్మిన్ ఆఫీసర్ నవీన్‌యాదవ్, లలిత్‌సింగ్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్ మేళా

పెనుబల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లి ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో మండలంలోని దివ్యాంగులకు రాయితీ బస్‌పాస్‌లు అందించారు. వీఎం బంజర్‌లోని శ్రీరాజసాయి మందిరంలో గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాయితీ పోగా మిగిలిన 50శాతం రుసుం స్థానిక రాజసాయి మందిరం నిర్వాహకులు జెన్నారెడ్డి నరసింహారెడ్డి చెల్లించారు. సత్తుపల్లి గ్రామీణ సీఐ ముత్తిలింగం చేతుల మీదుగా దివ్యాంగులకు పంపిణీ చేశారు. ఎస్సై వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


ఉచిత బస్ పాస్‌లు అందిస్తున్న సీఐ ముత్తిలింగం

పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు

పెనుబల్లి, న్యూస్‌టుడే: స్వచ్ఛతాహీ సేవ పక్షోత్సవాల్లో భాగంగా 33 పంచాయతీల సిబ్బందికి వైద్యాధికారి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. 117 మందికి ఆరోగ్య పరీక్షలు చేశారు. రక్త నమూనాలు సేకరించి టీ హబ్‌కు పంపించారు. తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎంపీడీఓ అన్నపూర్ణ, ఎంపీఓ ఉపేంద్రయ్య పాల్గొన్నారు.

కొణిజర్ల, న్యూస్‌టుడే: పంచాయతీ కార్మికులకు కొణిజర్ల, పెద్దగోపతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆరోగ్య పరీక్షలు గురువారం నిర్వహించారు. ఎంపీడీఓ రోజారాణి, ఎంపీఓ రాజేశ్వరి ఆరోగ్య పరీక్షలు పరిశీలించారు. వైద్యాధికారులు రాధాకృష్ణ, రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

శిరిడీ సంస్థాన్ సమాచార కేంద్రం ఏర్పాటు చేయాలి

వేంసూరు, న్యూస్‌టుడే: శిరిడీసాయి సంస్థాన్ ట్రస్ట్ సమాచార కేంద్రాన్ని విజయవాడలో కూడా ఏర్పాటు చేయాలని ఉమ్మడి ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ మాజీ డైరెక్టర్ భీమిరెడ్డి పుల్లారెడ్డి కోరారు. ఆయన శిరిడీలో ట్రస్ట్ ఉప కార్యనిర్వహణాధికారి తుకారాం భావూలేను గురువారం ఉదయం కలిసి వినతి పత్రం సమర్పించారు.

'తాగునీటి సమస్య రాకుండా చూడాలి'

బోనకల్లు, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా శిక్షణ పొందిన గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు పనిచేయాలని మిషన్ భగీరథ ఈఈ పుష్పలత సూచించారు. నాలుగు రోజులుగా మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ వర్కర్లకు బోర్లు, మంచినీటి పథకాల మోటార్లు, పైపులైన్లు మరమ్మతులపై ఇచ్చిన శిక్షణ గురువారం ముగిసింది. వారికి ఈఈ సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీడీవో సుబ్రహ్మణ్యశాస్త్రి, డీఈఈ శ్రీనివాసరావు, ఏఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమీక్షలు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: స్థానిక క్యాంపు కార్యాలయంలో కల్లూరు ఎంపీడీఓ, ఎంపీఓ, అన్ని పంచాయతీల కార్యదర్శులతో ఎమ్మెల్యే మట్టా రాగమయి సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఏఎంసీ ఛైర్మన్ బాగం నీరజ చౌదరి, డాక్టర్ మట్టా దయానంద్, పసుమర్తి చంద్రరావు పాల్గొన్నారు.
★ ఖమ్మం వరద బాధితుల సాయంకోసం కల్లూరు మండలం లింగాల కాంగ్రెస్ నాయకులు సేకరించిన 8 క్వింటాళ్ల బియ్యంను ఎమ్మెల్యే రాగమయికి అందజేశారు. కిష్టాపురానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రూ.18వేలు నగదు, మరో ఆరు క్వింటాళ్ల బియ్యం అందించారు.
★ మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులతో ఎమ్మెల్యే మట్టా రాగమయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య పరిరక్షణ చర్యలు చేపట్టాలని, వీధిలైట్లు లేని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనుమతి లేకుండా అక్రమంగా నిర్మించిన భవనాలు, కట్టడాల యజమానులకు నోటీసులందించాలన్నారు.
★ ప్రతి రెవెన్యూ గ్రామానికి ఏఈవోను నియమించాలని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మట్టా రాగమయిని వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈఓ) కలిసి వినతి పత్రం అందజేశారు.

'బదిలీలపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిలో చూపాలి'


జెండావిష్కరణ చేసి నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

వైరా, కారేపల్లి, న్యూస్‌టుడే: వైరా మున్సిపాలిటీ కమిషనర్ల బదిలీపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు అన్నారు. గురువారం గండగలపాడు గ్రామ సీపీఎం శాఖ మహాసభలు పల్లెబోయిన కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. బొంతు రాంబాబు మాట్లాడుతూ... మున్సిపాలిటీ అభివృద్ధికి వచ్చిన రూ.20 కోట్లు ఖర్చు చేయకపోవడంతో వెనక్కు వెళ్లాయన్నారు.
★ కారేపల్లి మండలం చర్లపల్లి గ్రామశాఖ సీపీఎం మహాసభ గురువారం తాటి సరోజిని అధ్యక్షతన నిర్వహించారు. శాఖ కార్యదర్శిగా బత్తుల శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యాలయాల్లో సమస్యలు పరిష్కరించాలి

ఏన్కూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ విద్యాలయాలు, గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ డిమాండ్ చేశారు. ఏన్కూరు, తిమ్మారావుపేట, బురద రాఘవాపురం, కేజీబీవీ, గురుకుల విద్యాలయాల్లో గురువారం సంఘం సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి గరిక శ్రీనివాస్, మండల బాధ్యులు ఫ్రాన్సిస్, వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి'


ముదిగొండ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న రాయల నాగేశ్వరరావు

మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: దెందుకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదిమంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు ముప్పా వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. పలు కేటగిరీల్లో వాలీబాల్ పోటీలకు దినేష్, భూమిక, పూజిత, భార్గవి, రేష్మ, ఉమారాణి, జ్యోత్స్న, లక్ష్మీప్రణీత, నరేందర్, సిద్ధు ఎంపికయ్యారు.

మధిర: మధిరలోని హరిజనవాడ జడ్పీ ఉన్నత పాఠశాల పాఠశాలకు చెందిన ఆరుగురు క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కబడ్డీ విభాగంలో ప్రతిభ చూపిన బాణోతు శిరీష, భూక్యా శ్రావణి, మాలోతు మౌనిక, భూక్యా బిందు, సునావత్ నవ్య, భవానిలను ఎంఈవో వై.ప్రభాకర్, ప్రధానోపాధ్యాయిని ఎన్.విజయశ్రీ, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ముదిగొండ, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. జోనల్ స్థాయి ఖో-ఖో, వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు గురువారం ముదిగొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులందించారు. ఎంఈఓ రమణయ్య, వలపతిరావు, శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గుంతను తప్పించబోయి.. తప్పిన ప్రమాదం


ప్రమాదం అంచున ఆగిన మినీ బస్సు

కొణిజర్ల, న్యూస్‌టుడే: గుంతను తప్పించబోయి మినీ బస్సు ప్రమాదం నుంచి బయటపడిన సంఘటన పల్లిపాడు, కొణిజర్ల మధ్య గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... కరీంనగర్‌కు చెందిన కొంతమంది భక్తులు మినీ బస్సులో అన్నవరం వెళ్లి తిరిగి వస్తున్నారు. పల్లిపాడు, కొణిజర్ల మధ్యలో రాష్ట్రీయ రహదారి గుంతలో బస్సు పడి అదుపు తప్పి రహదారి పక్కకు దూసుకుపోయింది. ఎడమ వైపు వెళ్తున్న బస్సు కుడి వైపునకు వెళ్లి రహదారి పక్కన ప్రమాదం అంచున నిలిచింది. డ్రైవర్ అప్రమత్తంగా లేకుంటే రహదారి పక్కన పొలాల్లోకి వెళ్లి పల్టీకొట్టేది. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

గుండెపోటుతో రైతు మృతి

పెనుబల్లి, న్యూస్‌టుడే: కొత్తకారాయిగూడేనికి చెందిన నూనె కృష్ణ(42) అనే రైతు గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఆ గ్రామంలోని తన పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా గుండె పోటుకు గురికావడంతో కుటుంబ సభ్యులు పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

లారీ డ్రైవర్‌కు ఐదు రోజులు రిమాండ్

వైరా, న్యూస్‌టుడే: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో బనవ అప్పలరాజు అనే లారీ డ్రైవర్‌కు గురువారం మధిర ఫస్ట్‌క్లాస్ అడిషనల్ కోర్టు మెజిస్ట్రేట్ ఐదు రోజులు రిమాండ్ విధించారు. ఏపీలోని ఏలూరుకు చెందిన అప్పలరాజు మద్యం తాగి లారీని నడుపుతూ పట్టుబడగా వైరాలో పోలీసులు తనిఖీలు చేసి అరెస్ట్ చేశారు.

తమ్మిలేరులో వ్యక్తి గల్లంతు

వేంసూరు, న్యూస్‌టుడే: కందుకూరు తుంగావారి కాలనీకి చెందిన తుంగా రామారావు అనే వ్యక్తి కాలనీ పక్కనే ఉన్న తమ్మిలేరులో పడి గల్లంతయ్యారు. ఈ ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఏరులో దిగిన పశువులను ఒడ్డుకు చేరుస్తున్న క్రమంలో రామారావు ప్రమాదవశాత్తు వాగులో పడిపోయారు. అతని ఆచూకీ కోసం పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో వెదుకుతున్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

చింతకాని, న్యూస్‌టుడే: సీతంపేటకు చెందిన నలుగురు లబ్ధిదారులు గతంలో దళితబంధు పథకంలో భాగంగా హార్వెస్టర్, కారును ఉమ్మడిగా తీసుకున్నారు. నారపోగు నాగయ్య అనే వ్యక్తి 2022 నుంచి ఆయా యూనిట్లను బాడుగకు ఇస్తూ మిగిలిన వారికి లెక్కలు చెప్పకుండా, కనీసం డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నాడు. మిగిలిన లబ్ధిదారులు ఎస్సీ కార్పొరేషన్ ఈడీని కలిసి ఫిర్యాదు చేశారు. ఈడీ సూచన మేరకు వాహనాల రీడింగ్ నమోదుకు వెళ్లిన వారిపై నారపోగు నాగయ్య, కుటుంబీకులు మరో అయిదుగురు మూకుమ్మడిగా గురువారం దాడిచేసి గాయపర్చారు. నారపోగు తిరపతమ్మ ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

నవరాత్రి వేడుకల కరపత్రాలు విడుదల

వైరా, న్యూస్‌టుడే: వైరా మహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శరన్నవరాత్రి వేడుకలకు సంబంధించి గురువారం కరపత్రాలను ఆవిష్కరించారు. హనుమాన్‌బజార్‌లోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో అక్టోబరు 3 నుంచి 12 వరకు అర్చకులు బొడ్డుపల్లి వాసుదేవశాస్త్రి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ఛైర్మన్ తిరుపతి రావు తెలియజేశారు. కార్యక్రమంలో రాజశేఖర్‌శాస్త్రి, శ్రీను, దుర్గ, కోటేశ్వరరావు, రాములు, బాలయ్య, రాంబాబు పాల్గొన్నారు.

750 ఎకరాల సాగు ప్రశ్నార్థకం

కల్లూరు, న్యూస్‌టుడే

కల్లూరు మండలం బత్తులపల్లి ఎత్తిపోతల పథకం పరిధిలో పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. అగంతకులు ఈ ఏడాది మే నెలలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి అందులో రాగితీగను అపహరించారు. పొట్ట దశలో ఉన్న పంట పొలాలు రక్షించుకునేందుకు ప్రస్తుతం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.

బత్తులపల్లి ఎత్తిపోతల కింద 750 ఎకరాలు సాగవుతుంది. సాగర్ ప్రధాన కాల్వ నీటిని ఎత్తిపోసి పక్కనే ఉన్న బావిలో నిల్వచేస్తూ ఆయకట్టుకు నీరందిస్తారు. ఈ ఏడాది 550 ఎకరాల్లో వరి, 180 ఎకరాల్లో పత్తి, 20 ఎకరాల్లో చెరకు పంటలు సాగు చేశారు. వేసవిలోనే చోరులు లిఫ్ట్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగలతోపాటు మోటార్ల తీగలనూ అపహరించారు. ఎత్తిపోతల మూలనపడ్డా వర్షాలు బాగా కురవటంతో రైతులు ధైర్యంచేసి కరివెద పద్ధతిలో వరి వేశారు. వర్షాలు, వ్యక్తిగత బోర్ల సాయంతో ఇన్ని రోజులూ నెట్టుకొచ్చారు. ఇప్పుడు చేతికొస్తున్న దశలో ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పూర్తిచేసి, టెండరు పిలిచినా నేటికీ సమస్య పరిష్కారం కాలేదు. ఎన్నెస్పీ అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదని రైతులు వాపోతున్నారు.


చిరుపొట్ట దశకు చేరిన వరి పంట

'ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.13 లక్షలతో టెండర్లు పిలిచి గుత్తేదారుకు పనులు అప్పగించాం. త్వరలో నీరందిస్తాం.'
- ఆనందకుమార్, ఎన్నెస్పీ ఎస్ఈ.


'లిఫ్ట్ కింద వరిసాగు చేశాను. పైరు చిరుపొట్ట దశలో ఉంది. ఏడెకరాలకు రూ.2లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. నీళ్లు రాకపోతే చివరి దశలో ఎండిపోతుంది.'
- తల్లపురెడ్డి అనిమిరెడ్డి, రైతు.

ఐలమ్మ పోరాటం ఆదర్శప్రాయం: ఎమ్మెల్యే రాగమయి


ఐలమ్మ విగ్రహానికి పూలదండలు వేసిన అనంతరం కేకు కోస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి, న్యూస్‌టుడే: తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ పోరాటం అందరికీ ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని సత్తుపల్లి బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో ఆమె విగ్రహానికి గురువారం నివాళులర్పించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాసరావు, డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొన్నారు. దోబీఘాట్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఏఎంసీ ఛైర్మన్ దోమ ఆనంద్ బాబు, పుర వైస్ ఛైర్‌పర్సన్ తోట సుజలారాణి పాల్గొన్నారు. * గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో ఐలమ్మ చిత్రపటానికి కమాండెంట్ పీజేపీసీ చటర్జీ నివాళులర్పించారు.

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: రాజులదేవరపాడులోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి నివాళి అర్పించారు. రజక సంఘం ఆధ్వర్యంలో తక్కెళ్లపాడులో వేడుకలు జరిపారు.

మధిర, న్యూస్‌టుడే: చాకలి ఐలమ్మ జయంతిని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పుల బుజ్జి ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించారు. తెదేపా నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, మల్లాది హనుమంతరావు, తహసీల్దార్ ఆర్.రాంబాబు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ లత, జడ్పీ మాజీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజు, కాంగ్రెస్ నాయకులు కిశోర్ నివాళులర్పించారు.


ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ రామనాథం, తహసీల్దార్ ఆర్.రాంబాబు

ముదిగొండ: ఐలమ్మ చిత్రపటానికి తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, సిబ్బంది నివాళి అర్పించారు.

పెనుబల్లి, న్యూస్‌టుడే: వీఎం బంజర్‌లోని ఐలమ్మ విగ్రహానికి తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎంఈఓ సత్యనారాయణ పూలమాల వేశారు. రజక సంఘం మండల అధ్యక్షులు పంతంగి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కారేపల్లి: కారేపల్లి రజక సంఘం ఆధ్వర్యంలో బస్టాండ్ కూడలిలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జూపల్లి కృష్ణ, జానకి రాములు, వీరభద్రం పాల్గొన్నారు.

(c) eenadu

ఖమ్మం
• ఖమ్మం • పాలేరు

తాగునీటి కాలుష్యం లేకుండా పర్యవేక్షించాలి: ఈఈ

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో రక్షిత మంచినీటి సరఫరాలో అప్రమత్తంగా ఉండాలని, కాలుష్యం లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పుష్పలత సూచించారు. గ్రామ మంచినీటి సహాయకులకు మూడు రోజులుగా రఘునాథపాలెం రైతు వేదికలో ఇస్తున్న శిక్షణ గురువారం ముగిసింది. శిక్షణ పొందినవారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. డీఎల్‌పీఓ రాంబాబు, ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఓంప్రకాశ్, ఏఈ శ్రీనివాస్, నీటి నాణ్యత జిల్లా ల్యాబ్ పర్యవేక్షణ అధికారి రమ, పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఈఈ పుష్పలత, డీఎల్‌పీఓ రాంబాబు

29న 'గువ్వా.. గోరింకతో' కార్యక్రమం

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో 29న సాయంత్రం 6 గంటలకు 'గువ్వా.. గోరింకతో..' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రముఖ హాస్య నటుడు మెరిగిల్ల గుణకర్, గాయకుడు నాగసాయి గురువారం తెలిపారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన ఆల నాటి మధుర గీతాలను ఆలపిస్తారని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
ఖమ్మం: 80085 52623, 80085 73668
రఘునాథపాలెం: 8008573674
పాలేరు: 97010 67081

వరద బాధితులకు సాయం



పరుపులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

కూసుమంచి, న్యూస్‌టుడే: నాయకన్‌గూడెంలో వరద బాధితులకు గురువారం పరుపులు, దుప్పట్లను పంపిణీ చేశారు. దివంగత చిలకల త్రిన పోటయ్య జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులైన కేబీఎస్ ఉద్యోగులు సీహెచ్ వీరయ్య, ధనలక్ష్మి దంపతులు, ఫీల్డ్ అసిస్టెంట్ సీహెచ్ రాము, రమాదేవి వీటిని సమకూర్చారు.

సమస్యలు పరిష్కరించాలి: యూటీఎఫ్

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాపగంటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో మాట్లాడారు. గురుకులాల్లో పాఠశాల పని వేళలు మార్చాలని, ప్రిన్సిపాళ్లకు గెజిటెడ్ హోదా కల్పించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం 28న తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు జీవీ నాగమల్లేశ్వరరావు, జేఏసీ నాయకులు శ్యాంకుమార్, ఉపేందర్, మహేశ్, దామోదర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కళలకు నెలవై.. అభివృద్ధి కరవై..!

◆ భక్త రామదాసు క్షేత్రం దుస్థితి

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే

కళాభిమానులు ఆదివారం కాస్త ఆహ్లాదం పొందాలన్నా, ఔత్సాహిక కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలన్నా చూసేది భక్తరామదాసు కళాక్షేత్రం వైపే.. రెండున్నర దశాబ్దాలుగా ఎన్నో ప్రదర్శనలకు వేదికగా నిలిచింది. వందల మంది కళాకారులకు గుర్తింపునిచ్చింది. అలాంటి క్షేత్రం ఇప్పుడు సమస్యలతో కునారిల్లుతోంది. మౌలిక సదుపాయాలు కరవై అభివృద్ధి ప్రదాతల కోసం ఆశగా ఎదురు చూస్తోంది.



పెచ్చులూడిన పైకప్పు



పలుచోట్ల విరిగిపోయిన కుర్చీలు



మూడు దశాబ్దాల ప్రస్థానం

80వ దశకానికి ముందు ఖమ్మం నగరంలో ఏదైనా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవాలంటే గుట్టలబజారు బాలికల పాఠశాల, గాంధీచౌక్ వర్తక సంఘం భవనాల్లో జరుపుకొనేవారు. నగరానికి ఓ కళాక్షేత్రం కావాలని నాటి కళాభిమానులు కోరడంతో 1992లో జడ్పీ నిధులతో నాటి ఎమ్మెల్సీ పువ్వాడ నాగేశ్వరరావు చేతుల మీదుగా భక్త రామదాసు కళాక్షేత్రం నిర్మాణానికి బీజం పడింది. ఎట్టకేలకు 1999, ఆగస్టు 19న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభోత్సవం చేశారు. 2017లో రూ.కోటి నిధులతో సెంట్రల్ ఏసీ, ఆధునికీకరణ పనులు చేపట్టారు. నాటి నుంచి సాంస్కృతిక, నృత్య, వార్షికోత్సవ, సంగీత కార్యక్రమాలు, వేడుకలకు వేదికగా నిలుస్తోంది. రవీంద్రభారతి తర్వాత తెలంగాణలోనే రెండో అతిపెద్ద ఆడిటోరియంగా గుర్తింపు పొందింది.

ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి: వీవీ అప్పారావు, సీనియర్ కళాకారుడు, ఖమ్మం కళా పరిషత్ గౌరవాధ్యక్షుడు

ఖమ్మం జిల్లాకు మణిహారంగా నిలిచిన భక్తరామదాసు కళాక్షేత్రంలో పలు సమస్యలు ఇబ్బందులు పెడుతున్నాయి. ప్రేక్షకులకు వినోదం పూర్తిస్థాయిలో అందడం లేదు. కొన్ని పంకాలు తిరగడం లేదు. ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేయాలి.

సౌకర్యాలు మెరుగుపరిస్తే మరింత ఆదరణ - అన్నాబత్తుల సుబ్రహ్మణ్యకుమార్, ఆర్ట్స్ ప్రధాన కార్యదర్శి

ప్రతినెలా నాటకాలతో పాటు 20 వరకు కళా ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఏనాడో ఏర్పాటు చేసిన వసతులతోనే నడుస్తోంది. అభివృద్ధి పనులకు అంచనాలు రూపొందించాం. జిల్లా మంత్రులు, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశాం. సమస్యలు పరిష్కరించి కళాకారులు, ప్రేక్షకులు, కళాభిమానులకు వినోదాన్ని చేరువ చేయాలి.

సమస్యలతో వినోదం దూరం

వేదికపై 2009లో ఏర్పాటు చేసిన తెరలనే ఇప్పటికీ వినియోగిస్తున్నారు. దుమ్ము పట్టి పాడయ్యాయి. కళాకారుల మేకప్ గదులు పాతబడ్డాయి. భవనం పైకప్పు పలుచోట్ల పెచ్చులు ఊడి దర్శనమిస్తోంది. పరిసరాలు సైతం చెత్తాచెదారం, వ్యర్థాలతో అపరిశుభ్రం మారాయి. బౌండరీ మైకులు లేకపోవడంతో కళాకారుల సంభాషణలు కొన్నిసార్లు ప్రేక్షకులకు అర్థం కావడం లేదు. లైటింగ్ సిస్టమ్, తెరలు, మైకులు అద్దెకు తీసుకురావాల్సి వస్తోంది. పలుచోట్ల కుర్చీలు విరిగిపోయాయి. వేదికపై ఏసీ మరమ్మతులకు గురికావడంతో అతిథులు, కళాకారులు ఇబ్బంది పడుతున్నారు. ముందు వీఐపీల కుర్చీలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు ఉన్నాయి. సమస్యలు పరిష్కరించాలని ఇటీవల సీనియర్ కళాకారులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌లకు వినతిపత్రాలను సమర్పించారు.

యూటీని మళ్లీ నిర్మిస్తాం: కలెక్టర్



ఇంజినీర్లతో కలిసి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కూసుమంచి, న్యూస్‌టుడే: పాలేరు జలాశయం దిగువన నాగార్జున సాగర్ ఎడమ కాల్వ యూటీ పునర్ నిర్మాణం చేపడతామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఇటీవల వరదల్లో యూటీ ధ్వంసం కాగా, ఆయకట్టులో సాగులో ఉన్న పంటలను కాపాడే నిమిత్తం దాని పునరుద్ధరించకుండానే కాల్వలను పటిష్టపర్చి నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. మూడు రోజుల క్రితం వచ్చిన భారీ వర్షానికి ఈ ప్రాంతంలో నీరు పెద్ద ఎత్తున నిలవడం, యంత్రాంగం భారీ మోటార్లు ఏర్పాటు చేసి కాల్వకు నీటిని మళ్లించిన నేపథ్యంలో 'ఈనాడు'లో గురువారం 'యూటీ తొలగింపుతో పొంచి ఉన్న ప్రమాదం..' శీర్షికన కథనం ప్రచురితమైంది. గురువారం ఇక్కడికి వచ్చిన కలెక్టర్ మరలా స్థలిని పరిశీలించారు. వరద స్థాయిని ఇంజినీర్లతో మాట్లాడి తెలుసుకున్నారు. ఆర్ కెనాల్ మీదుగా మేర కాల్వ కట్టపై కాలినడకన వెళ్లి పొలాల్లో నిల్చిన నీటిని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిశీలించారు. ప్రభుత్వం అనుమతితో యూటీని నిర్మిస్తామన్నారు. నిలిచిపోయిన నీటిని ప్రస్తుతం ఆరు భారీ మోటార్లతో తోడేస్తున్నామని, మరో ఆరు మోటార్లు సిద్ధంగా ఉంచుతామన్నారు. ఇప్పటికిప్పుడు ఎలాంటి ప్రమాదం లేదన్నారు. నీటి విడుదలతో ఆలస్యం కారణంగా జిల్లాలో పంటలకు వాటిల్లిన నష్టం చాలా తక్కువగా ఉందన్నారు. వరదలతో దెబ్బతిన్న చిన్నతరహా జలవిద్యుత్తు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు.

నగరంలో సినిమాలు.. శ్రీనివాస, శ్రీసాయిరాం, వినోద, కేపీఎస్, శ్రీతిరుమల: దేవర పార్ట్-1

గురువులను గౌరవించడం అందరి బాధ్యత



గరికపాటి నర్సింహారావును సన్మానిస్తున్న గుండాల కృష్ణ

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: గురువులను గౌరవించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని పద్మశ్రీ గరికపాటి నర్సింహారావు అన్నారు. ఖమ్మం ఎస్‌బీఐటీలో గురువారం ఏర్పాటు చేసిన ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గురువులతో చర్చిస్తే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడినైనా జయించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ, సెక్రటరీ, కరస్పాండెంట్ గుండాల ధాత్రి తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ క్రీడా పోటీల్లో ప్రతిభ

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: నగరంలో 24, 25 తేదీల్లో నిర్వహించిన సౌత్‌జోన్ మండల స్థాయి క్రీడా పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు కబడ్డీ పోటీల్లో సత్తా చాటినట్లు ఖమ్మం రెజొనెన్స్ శ్రీనివాసనగర్ స్కూల్ డైరెక్టర్లు ఆర్వీ నాగేంద్రకుమార్, నీలిమ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీలో ఐ.పవన్‌కుమార్, జె.చరణ్ బంగారు పతకాలు సాధించగా, వాలీబాల్ ఎ.సూర్యసుహాస్ రజత పతకం సాధించాడు. అండర్-17 కబడ్డీ ఎస్.ప్రశాంత్, పి.రాంచరణ్, వాలీబాల్ సీహెచ్.వర్షిత్ బంగారు పతకాలు సాధించి అంతర్‌జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో నీలిమ తదితరులు

జూనియర్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌కు ఎంపిక



విద్యార్థులతో రవిమారుత్, ప్రిన్సిపల్ పార్వతిరెడ్డి

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేథమెటిక్స్ ఎడ్యుకేషన్, థానే ఆధ్వర్యంలో జూనియర్ మేథమెటిక్స్ ఒలింపియాడ్ పరీక్ష రాసేందుకు అర్హత పరీక్షకు తమ పాఠశాల నుంచి పలువురు ఎంపికైనట్లు ఖమ్మం హార్వెస్ట్ విద్యా సంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్.పార్వతిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో లెవల్ పరీక్షకు 30 మంది ఎంపికయ్యారని, జి.అర్జున్ 84 మార్కులతో మొదటి స్థానం, ఎస్.అభిరామ్ 76 మార్కులతో రెండో స్థానం సాధించినట్లు తెలిపారు. ఈషా సింగ్, కృష్ణ సుచేత్, అయోగ్ ధీర్ 74 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: తమ పాఠశాలకు చెందిన మూడో తరగతి విద్యార్థి విశ్వకార్తీక్ రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైనట్లు ఖమ్మం స్మార్ట్‌కిడ్జ్ పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, చింతనిప్పు సుకన్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.



విశ్వకార్తీక్‌ను అభినందిస్తున్న చింతనిప్పు కృష్ణచైతన్య

వచ్చే నెల 3, 4 తేదీల్లో భువనగిరిలో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి రోలర్ స్కేటింగ్ పోటీలకు జిల్లా నుంచి ఎంపికయ్యాడు. జిల్లా స్థాయి పోటీల్లో మూడు బంగారు పతకాలు సాధించాడు. రోడ్డు స్కేటింగ్ పోటీల్లో, వన్‌లాప్ స్కేటింగ్ పోటీల్లో, 5 లాప్స్ స్కేటింగ్ పోటీల్లో వరుసగా మూడు బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి మా క్లయింటు వంగవీటి నవీన్, S/o. లేటు రంగారావు, నివాసం: జూబ్లీపుర, ఖమ్మం వారి సూచన మేర తెలియజేయునది! మా క్లయింటు II అదనపు జిల్లా వారి కోర్టు నందు శ్రీ పెరుమాళ్ళ శ్రీనివాసరావు, తండ్రి: నాగేశ్వరరావు, నివాసం: 9-11-68/1, కమాన్‌బజార్, ఖమ్మం వారిపై O.S.No. 45/2024 సివిల్ దావా మరియు I.A.No. 02/2024 ద్వారా క్రింది షెడ్యూలు ఆస్తిపై అటాచ్‌మెంటు ఆర్డరు తీసుకొని ఉన్నారు. కావున క్రింది షెడ్యూలు ఆస్తి విషయమై ఎవరునూ ఎటువంటి లావాదేవీలు జరుపుటకు వీలు లేదు. అలా చేసినచో సదరు లావాదేవీలు చట్టపరంగా చెల్లనేరవు.

షెడ్యూలు ఆస్తి

Item No.1:
House bearing No. 2-4-128, 2-4-128/A, 2-4-128/B, 2-4-129, 2-4-131, 2-4-132, 2-4-133, 2-4-134, 2-4-135, 2-4-136, 2-4-137, 2-4-138 & 2-4-138/A to an extent of 3434.13 sq.yards out of which the developers (P.Srinivasarao & anothers) share is 53% which comes to 1820 sq.yards situated in and out Sy.No. 513, 514 Dabala Bazar, within the limits of Khammam municipal Corporation, Khammam City & District. within the following boundaries: **East:** 60'-0" Wide Road, **West:** Viswa Towers Apartments, **North:** Viswa Towers Land, **South:** Rythu Bazar.

Item No.2:
Land in Sy.No. 204/A4, 201/C, 202/C, 205/B1/1, 205/B2, 207/A2, 200/A1, 201/A/1, 202/A/1, 199/B/1/A, 209/1 to an extent of 22717 Sq.yards (Seeking attachment to the share of the respondent 50%) situated at Damsalapuram, Khammam Urban, Khammam Dist. **East:** Land of T.Venkateswarlu, S.Laxmaiah and others, **West:** Land of K.Buchaiah, G.Anup and others, **North:** Road and Land of Laxmaiah, **South:** Land belongs to T.Amrutamma & Others.

Sd/- SK.Akbar Pasha, M.K.Hussain, S.Ravinder Reddy
Advocates, Khammam. Cell: 9399311674.

కుల నిర్మూలనకు పోరాడదాం: మాస్‌లైన్

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: సంఘ సంస్కర్త జ్యోతిబా పులే స్థాపించిన సత్యశోధక సంస్థ స్ఫూర్తితో దేశంలో కుల నిర్మూలనకు ప్రజలు పోరాడాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకురాలు సీహెచ్.శిరోమణి అన్నారు. బల్లేపల్లి శాఖ ఆధ్వర్యంలో గురువారం కుల నిర్మూలనపై సమావేశం నిర్వహించారు. 30 వరకు గ్రామగ్రామాన కుల నిర్మూలన సభలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి జె.లెనిన్, కె.శ్రీనివాస్, కొమరయ్య, తరుణ్‌కృష్ణ, లక్ష్మీనారాయణ, నాగన్న, రమేశ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

దసరా సెలవులు అమలు చేయాలని వినతి

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: దసరా సెలవులను కచ్చితంగా అమలు చేయాలని కోరుతూ ప్రైవేటు ఉపాధ్యాయుల సంఘం ఫోరం జిల్లా అధ్యక్షుడు కొరకొప్పు రామారావు గురువారం ఖమ్మంలో డీఈఓ సోమశేఖరశర్మకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం అక్టోబరు 2 నుంచి 14 వరకు ప్రతి ప్రైవేటు పాఠశాల సెలవులను తప్పక పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సెలవుల్లో కార్యశాలలు, ప్రత్యేక తరగతులు, ఇతర శిక్షణ కార్యక్రమాలు నిర్వహించకుండా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

రక్తదాన శిబిరం

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: సినీ కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా విడుదల నేపథ్యంలో ఎన్టీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం నగరంలోని తిరుమల థియేటర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు కూరపాటి ప్రదీప్ ప్రారంభించారు.
✦ సినిమా బెనిఫిట్, ప్రీమియర్‌షోల సందర్భంగా పోలీసులు థియేటర్ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

అవగాహన లేమితో మరణాలు

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: అవగాహన లేమితోనే పలువురు గుండెజబ్బులతో మరణిస్తున్నారని వైద్య నిపుణులు పేర్ల హర్షతేజ, సుమన్, నందన్ అన్నారు. ఖమ్మం నగరంలో వెంకటేశ్వర హాస్పిటల్, వాకర్స్, ఏకో క్లబ్ ఆధ్వర్యంలో పెవిలియన్ మైదానం నుంచి బాలాజీ నగర్ వరకు గురువారం గుండె జబ్బులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. శ్యామ్‌బాబు, దామోదర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, దుర్గేశ్, స్వామిరెడ్డి, రవి పాల్గొన్నారు.

అనంతరామయ్య సేవలు మరువలేనివి

కామేపల్లి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీకి మద్దినేని అనంతరామయ్య చేసిన సేవలు మరువలేనివని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. తాళ్లగూడెంలో దశ దిన కర్మ గురువారం జరిగింది. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, నాయకులు రాధాకిషోర్, సర్వోత్తమ్ రెడ్డి, నర్సింహారెడ్డి, మల్లిబాబు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

రాత పుస్తకాల పంపిణీ

కూసుమంచి, న్యూస్‌టుడే: ఖమ్మం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చేగొమ్మ ఉన్నత పాఠశాలలో గురువారం రూ.37 వేలతో 125 మంది విద్యార్థులకు ఆంగ్లం, తెలుగు, హిందీ చూచిరాత రాతపుస్తకాలు, దైనందినులను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు బొల్లికొండ శ్రీనివాసరావు, శ్రీదేవి, లయన్స్ రీజనల్ ఛైర్‌పర్సన్ డీసీపీ రావు, కార్యదర్శి శ్రీరాం, కోశాధికారి గోవిందరావు పాల్గొన్నారు.

వృద్ధ దంపతులకు గాయాలు

కామేపల్లి, న్యూస్‌టుడే: కొత్తగూడెనికి చెందిన వృద్ధ దంపతులు తులసీరామ్, కళావతి ఖమ్మంలో ఉన్న కుమారై వద్దకు టీవీఎస్ వాహనంపై గురువారం వెళ్తున్నారు. తాళ్లగూడెం వద్దకు రాగానే కళావతి చీరకొంగు వాహన చక్రంలో పడటంతో అదుపు తప్పి దంపతులిద్దరూ కిందపడ్డారు. గాయాలైన వారిద్దరినీ ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.

మహిళా శక్తికి ప్రతీక ఐలమ్మ

ఖమ్మం నగరం, ఖమ్మం సంక్షేమవిభాగం, ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహిళా పోరాట శక్తికి ప్రతీక చిట్యాల ఐలమ్మ అని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అన్నారు. చాకలి ఐలమ్మ 129వ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఆమె చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీపీఓ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు. ★ ఐలమ్మ విగ్రహానికి టీజీఓ(తెలంగాణ గెజిటెడ్ అధికారుల) సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు గురువారం నివాళులు అర్పించారు. టీజీఓ సంఘం జిల్లా కార్యదర్శి వేలాద్రి, టీఎన్జీఓ నాయకులు కొణిదెన శ్రీనివాస్, ఆయుష్ ప్రకాశ్, తాళ్లూరి శ్రీకాంత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు. ★ వీర నారీమణుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. జిల్లా కార్యాలయంలో విగ్రహానికి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్రబాయి, ప్రధాన కార్యదర్శి మామిడాల ఝాన్సీ, షేక్ నజీమా, డా.గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు. ★ జిల్లా ఆసుపత్రి వద్ద ఐలమ్మ విగ్రహానికి భారాస నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు కూరాకుల నాగభూషయ్య, బిచ్చాల తిరుమలరావు, దండా జ్యోతిరెడ్డి, నరేందర్, సుబ్బారావు, సుగుణారావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం కార్పొరేషన్: ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న భారాస నేతలు

కామేపల్లి, న్యూస్‌టుడే: పండితాపురంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ నివాళి అర్పించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట ప్రవీణ్, నాయకులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: భాజపా, సీపీఐ మండల నాయకుల ఆధ్వర్యంలో నేలకొండపల్లిలో ఐలమ్మ జయంతి నిర్వహించారు.

కూసుమంచి: మండల పరిషత్తు కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి నివాళి అర్పించారు.

జేఏఓగా ఉద్యోగోన్నతి

ఖమ్మం రోటరీనగర్: టీజీఎస్పీడీసీఎల్ ఖమ్మం టౌన్-2 ఈఆర్‌ఓలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న ఎం.ప్రసాద్ జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్(జేఏఓ)గా ఉద్యోగోన్నతి పొందారు. ఆయనను సర్కిల్ ఆఫీస్‌కు కేటాయించారు. ప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ప్రసాద్ సీఐటీయూ అనుబంధ విద్యుత్తు ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శిగా ఉన్నారు. ఎస్ఏఓ జి.శ్రీధర్, ఏఓ సీతారాంగోపాల్, ఆర్.సత్యనారాయణ, శేష శుభాకాంక్షలు తెలిపారు.

మత్స్యకారులకు శిక్షణ

కూసుమంచి, న్యూస్‌టుడే: సిరిసిల్ల జిల్లా మత్స్య సహకార సంఘాల సభ్యులకు పాలేరులోని మత్స్య పరిశోధన కేంద్రంలో నైపుణ్య శిక్షణ నిర్వహించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్, శాస్త్రవేత్త రవీందర్, మత్స్య శాఖ ఫీల్డ్ ఆఫీసర్ చాముండేశ్వరీ అవగాహన కల్పించారు.

ANNIE BESANT COLLEGE OF EDUCATION
PONNEKAL, KHAMMAM-507 170
(Approved by NCTE and Govt. of T.S Affilited Kakatiya University)
website: abcekhammam.org

NOTIFICATION FOR ADMISSION INTO B.Ed COURSE UNDER CATEGORY-B
Applications are invited from the eligible candidates for B.Ed course for the academic year 2024-25 for category B seats with or without Ed.CET-2024 and should have secured 50%marks (Reserved categories 40%) in Degree or equalency examinations. Applications should be submitted in the college office along with original certificates on or before 08-10-2024

Course	Intake	B.Category Seats
B.Ed	50	12

Cont. 9912 220 206 CORRESPONDENT

పొడి చెత్త సేకరణ కేంద్రాన్ని పునః ప్రారంభించాలి



దానవాయిగూడెం డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని దానవాయిగూడెం డంపింగ్ యార్డులో పొడిచెత్త సేకరణ కేంద్రాన్ని పునః ప్రారంభించాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వారం రోజులుగా స్థానికులు డంపింగ్ యార్డును తరలించాలని ఆందోళన చేస్తున్న నేపథ్యంలో దిద్దుబాటు చర్యలు ప్రారంభించారు. యార్డును గురువారం పరిశీలించిన కమిషనర్ బయో మైనింగ్‌ను వేగవంతం చేస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ప్రకృతి వనం, ఉద్యానవనం ఏర్పాటు చేయాలని, ఆ ప్రాంతాన్ని త్వరితగతిన అందుబాటులోకి తేవాలన్నారు.

ఏబీసీ కేంద్రం పరిశీలన: అనంతరం రోటరీనగర్‌లో జంతు సంరక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అక్కడున్న సౌకర్యాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సహాయ కమిషనర్ సంపత్‌కుమార్, ఈఈ కృష్ణలాల్, సిబ్బంది శ్రీనివాస్, సాంబయ్య, సంపత్ తదితరులు ఉన్నారు.
★ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా నగరంలోని మోమినాన్ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, వారితో ప్రతిజ్ఞ చేయించారు.

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: రాపర్తినగర్ బీసీ కాలనీ వద్ద నిర్వహిస్తున్న డంపింగ్ యార్డు తరలించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం కమిషనర్ అభిషేక్ అగస్త్యను కలిసి వినతిపత్రం అందజేశారు. చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు.

నాణ్యమైన వైద్య సేవలందించాలి: శ్రీజ

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ వైద్యాధికారులను హెచ్చరించారు. ఖమ్మం సర్వజనాసుపత్రిని గురువారం తనిఖీ చేశారు. ఫార్మసీ కేంద్రానికి వెళ్లి రిజిస్టర్లు పరిశీలించారు. రోగుల వార్డులు, ఓపీ, ఐపీ, ఐసీయూ, సదరం విభాగం, డంపింగ్ యార్డు, సఖీ కేంద్రాలను పరిశీలించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, ఆర్ఎంఓ కళావతిబాయి, రాంబాబు, వినాయక్‌రాథోడ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రాంప్రసాద్, ఇందిరాదేవి, ఫార్మసీ సూపర్‌వైజర్ పద్మ పాల్గొన్నారు.




ఫార్మసీ విభాగంలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న శ్రీజ

ఆస్పత్రి సేవలపై అవగాహన

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: ఆస్పత్రి సేవలపై యువతకు అవగాహన కల్పిస్తున్నట్లు మేరా యువ భారత్ సంస్థ జిల్లా ప్రతినిధి భాను తెలిపారు. సేవా సే సీఖే 2024 కార్యక్రమంలో భాగంగా సర్వజనాసుపత్రిలో శిక్షణకు ఎంపికైన ఎనిమిది మంది డీ-ఫార్మసీ విద్యార్థులకు గురువారం సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, ఆర్ఎంఓ కళావతి బాయి తరగతులు ప్రారంభించారు. ప్రభుత్వ పథకాలపై వారికి అనుభవాత్మక అభ్యాసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు.

శ్రద్ధాంజలి



కీ॥శే॥ మద్దినేని క్రిష్ణయ్య గారు
Rtd. HM - ఖమ్మం

మీరు వేసిన ప్రతి అడుగు ఆదర్శం.. మీరు నడిచిన ప్రతి దారి సదాశయం.. మీరు చేరిన ప్రతి గమ్యం స్ఫూర్తి శిఖరం.. మీరే మాకు మార్గదర్శకులు.. దివికేగిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ.. మీ జ్ఞాపకాలతో నిరంతరం ముందుకు సాగుతూ...

భార్య: మద్దినేని గుణసుందరి

కుమారుడు-కోడలు: మద్దినేని చంద్రశేఖర్ - సంధ్య
మనవరాలు: ఆద్య

కుమార్తె-అల్లుడు: కావూరు జ్యోతి - రమేష్
మనవళ్ళు: నిషాంత్, శాండిల్య

పెద్దకర్మ: రేపు ది.28-09-2024 శనివారం ఉ॥ 11:30 ని॥ల నుండి గొరిల్లాపార్క్, ఖమ్మం నందు జరుగును.

గమనిక : బంధుమిత్రులు ఈ ప్రకటననే కార్డుగా భావించగలరు.

ఈనాడు, ఖమ్మం: 8008009924